# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :84 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 30-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఇలాంటి శత్రు దుర్భేద్యమైన కోట,లోయ ఎక్కడా లేవు!

ప్రపంచంలో చాలా అందమైన ప్రాంతాలను చూశానని.. ఇలాంటి శత్రు దుర్భేద్యమైన కోట, లోయ ఎక్కడా లేవని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇక్కడున్న విశాలమైన కొండలు, లోయలు చూస్తుంటే తన మనసు పులకించిందన్నారు.గండికోట ప్రాంతంలో త్వరలో 100 అడుగుల శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. గండికోటను మాజీ సీఎం వైఎస్ జగన్ ఏ రకంగానూ అభివృద్ధి చేయలేదు అని పెమ్మసాని విమర్శించారు. నేడు ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన గండికోటను జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి పెమ్మసాని సందర్శించారు.కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలో చాలా అందమైన ప్రాంతాలను చూశా. ఇలాంటి శత్రు దుర్భేద్యమైన కోట, లోయ ఎక్కడా లేవు. ఇక్కడున్న విశాలమైన కొండలు, లోయలు చూస్తుంటే నా మనసు పులకించింది. అద్భుతమైన పెన్నా లోయ, అందమైన గండికోటను 78 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నాం. గండికోట ప్రాంతంలో త్వరలో 100 అడుగుల శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని

## నాణ్యత ప్రమాణాలు పెంచి వినియోగదారులను నిలుపుకోవాలి..




హైదరాబాద్. రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తపరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టింది. ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై నేడు కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేసింది.కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి తరపున సంస్థ సిఎండి ఎన్.బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బలరాం సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా .కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచిం చారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు మరియు బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు.బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదాయిలకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని, దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆయన కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఈడీ శ్రీ ఎస్డీఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

## గిగ్ వర్కర్ల హక్కులకు కాంగ్రెస్ పెద్దపీట..



న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గిగ్ వర్కర్ల (ఆన్‌లైన్ వేదికల ద్వారా పనిచేసేవారు) హక్కులు, సంక్షేమంపై గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా గిగ్ కార్మికులు తనతో పంచుకున్న ఆవేదనను గుర్తుచేసుకున్నారు. "మాకు రేటింగ్ కాదు, హక్కులు కావాలి. మేము మనుషులమే కానీ, బానిసలం కాదు" అని వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు తన మదిలో బలంగా నాటుకుపోయాయని ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. గిగ్ కార్మికుల భద్రత, న్యాయమైన ఒప్పందాలపై కర్నాటక ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ చారిత్రాత్మకమైందని అభివర్ణించారు.

ఆర్డినెన్స్‌తో భరోసా..

కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం గిగ్ వర్కర్ల హక్కులు, గౌరవం, భద్రతకు హామీ ఇస్తూ ఒక ఆర్డినెన్స్ జారీ చేయడం చారిత్రాత్మక ముందడుగు అని రాహుల్ ప్రశంసించారు. ఎండ, వాన, చలి వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని గిగ్ కార్మికులు మనకు ఆహారం, నిత్యావసర వస్తువులు చేరవేస్తారని అన్నారు. అయినప్పటికీ, వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎలాంటి వివరణ లేకుండా యాప్‌ల నుంచి వారిని బ్లాక్ చేయడం, అనారోగ్యానికి గురైతే సెలవులు కూడా మంజూరు కాకపోవడం, వారికి చెల్లించే మొత్తాలు పారదర్శకత లేని అల్గోరిథమ్‌ల ద్వారా నిర్ణయించబడటం వంటివి గిగ్ వర్కర్ల ప్రధాన సమస్యలని ఆయన వివరించారు.

ఆ పరిస్థితులను సమూలంగా మార్చేస్తాం..

కర్నాటక ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఆర్డినెన్స్ ఈ పరిస్థితులను మార్చనుందని రాహుల్ గాంధీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఆర్డినెన్స్ ద్వారా గిగ్ కార్మికులకు సామాజిక భద్రత, న్యాయమైన ఒప్పందాలు, చెల్లింపుల విషయంలో అల్గోరిథమిక్ పారదర్శకత, ఏకపక్షంగా యాప్‌ల నుంచి తొలగించకుండా రక్షణ వంటివి లభిస్తాయని స్పష్టం చేశారు.

సేవ చేసేలా టెక్నాలజీ ఉండాలి..

టెక్నాలజీ అనేది ప్రజలకు సేవ చేసేదిగా ఉండాలని, ఈ విషయంలో రాజస్థాన్, కర్నాటక రాష్ట్రాలు మార్గదర్శకంగా నిలిచాయని రాహుల్ అన్నారు. త్వరలోనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదేబాటలో పయనిస్తుందని సూచనప్రాయంగా తెలిపారు. గిగ్, ప్లాట్‌ఫామ్ ఆధారిత పనులు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నప్పటికీ, అవి పని సంబంధాలను పునర్నిర్మిస్తున్నాయని పేర్కొన్నారు. కార్మికుల హక్కులే కేంద్రంగా ఈ వ్యవస్థలు ఉండాలని, ఈ విధానాన్ని ప్రతి రాష్ట్రానికి విస్తరిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

## ప్రభుత్వం రైతాంగానికి అండ..



ఖమ్మం జిల్లా: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం లో రైతులు ఈ ఏడాది ధాన్యం పండించారని, 65 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతాంగం పండించారని, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా లో డిప్యూటీ సీఎంతోపాటు ఇన్చార్జ్ మంత్రులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలబడిందని, ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతాంగానికి వారం రోజుల్లలో వారి ఎకౌంట్లలో డబ్బులు వేస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయమని, రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని భట్టి విక్రమార్క అన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు..

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి ఒకేసారి 3,500 కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నిరంతరం ఇళ్ల మంజూరు ప్రక్రియ జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలతో ఆడుకున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో నాలుగు లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేసి పేదలకు అందజేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. చిన్న పొరపాటు కూడా జరగడానికి వీల్లేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

ఇదో మహోత్తర కార్యక్రమం..

ఇదోక మహోత్తర కార్యక్రమం అని, ఇంత గొప్ప కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పేదలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. రాష్ట్రంలో రైతన్నకు విత్తనాలు అందజేసే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, నకిలీ విత్తనాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో రైతాంగానికి, ప్రజలకు హామీ ఇచ్చామని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిని రద్దు చేస్తామని స్పష్టంగా చెప్పామన్నారు. చెప్పినట్టుగానే అధికారంలోకి రాగానే ధరణిని రద్దుచేసి ఆనాదిగా వస్తున్న దుర్మార్గపు చట్టాలను తొలగించి సరికొత్త భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చామన్నారు. జూన్ 2న ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని చెప్పారు. పెద్ద ఎత్తున సంబరాలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.

ఇది ప్రజా ప్రభుత్వం.. మంత్రి పొంగులేటి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఇన్చార్జి మంత్రులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై అధికారులతో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సీజనల్ వ్యాధుల దగ్గర నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు ప్రతి ఒక్క అంశంపై చర్చ జరుపుతున్నామని, ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నామని, అధికారులకు స్పష్టమైన ఆదేశాలిస్తున్నామన్నారు. రైతాంగానికి ప్రజలకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది కలగడానికి వీల్లేదని.. ఇది ప్రజా ప్రభుత్వమని, పేదల ప్రభుత్వమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు.మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో ముందు ఉందని అన్నారు.

## పార్టీలో కుట్రలు.. నన్ను కావాలనే ఓడించారు..



హైదరాబాద్,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తనను కావాలనే నిజామాబాద్ ఎంపీ ఎన్నికల్లో ఓడించారని, కేసీఆర్‌కు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనను పార్టీకి దూరం చేస్తే ఎవరు లబ్ధి పొందుతారో అందరికీ తెలుసని పరోక్షంగా కొందరిపై విమర్శలు గుప్పించారు.

పార్టీలో కుట్రలు, అవమానాలు:

కవిత వ్యాఖ్యల ప్రకారం, ఆమెపై పార్టీలోనే కుట్రలు జరుగుతున్నాయని స్పష్టమవుతోంది. "వర్కింగ్ ప్రెసిడెంట్గా ఉన్న వారిని గౌరవిస్తాను, కానీ అమెరికా నుంచి వచ్చేలోగా తనను పార్టీ నుంచి బయటకు పంపే ప్రయత్నం చేశారు" అంటూ ఆమె చేసిన ఆరోపణలు పార్టీలోని అంతర్గత విభేదాలను బట్టబయలు చేస్తున్నాయి. ఇది పార్టీలో ఒక వర్గం ఆమెను పక్కన పెట్టాలని చూస్తున్నారనే సందేహాలను రేకెత్తిస్తోంది.

తప్పుడు వార్తలపై పార్టీ మౌనం:

తనపై వస్తున్న తప్పుడు వార్తలను పార్టీ ఎందుకు ఖండించడం లేదని కవిత నిలదీశారు. బీఆర్ఎస్ చేయాల్సిన సగం పనులను తాను జాగృతి తరఫున చేస్తున్నానని గుర్తు చేశారు. "దూతలను పంపి రాయబారాలు చేస్తే ఏం లాభం?" అని ప్రశ్నించడం ద్వారా ఆమె పార్టీ నాయకత్వంపై పరోక్షంగా అసంతృప్తిని వ్యక్తం చేశారు.

పార్టీలో కోవర్టుల ఆగడాలు:

కె.సి.ఆర్.కు నోటీసులొస్తే ఎవరూ స్పందించలేదని, కానీ మరో నేతకు వస్తే ఎందుకు హంగామా చేశారంటూ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో కోవర్టులు ఉన్నారని ఒప్పుకుంటున్నప్పుడు వారిని ఎందుకు పక్కన పెట్టడం లేదని ఆమె దుయ్యబట్టారు. ఈ వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత గూఢచర్యం, ద్రోహుల ఉనికిని కవిత ధృవీకరిస్తున్నాయని స్పష్టం చేస్తున్నాయి.

భవిష్యత్ పరిణామాలు:

కవిత చేసిన ఈ షాకింగ్ కామెంట్లు బీఆర్ఎస్ పార్టీలో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. ఆమె వ్యాఖ్యలు పార్టీలోని అంతర్గత కుమ్ములాటలను, నాయకత్వంపై అసంతృప్తిని స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తును ఏ విధంగా ప్రభావితం చేస్తాయో వేచి చూడాలి. కవిత ఆరోపణలపై పార్టీ నాయకత్వం ఏ విధంగా స్పందిస్తుంది, ఆమె తన రాజకీయ భవిష్యత్తును ఎలా మలుచుకుంటుంది అనే అంశాలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## కవిత అసంతృప్తి.. బీఆర్ఎస్ పతనానికి నిదర్శనం



హైదరాబాద్,బీఆర్ఎస్ లో జరుగుతున్న పరిణామాలపై బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన, ఆమె అసంతృప్తి అనేది గత కొంతకాలంగా బయటపడుతోందని, ఇది ఇక బహిరంగంగానే మారిపోయిందని పేర్కొన్నారు. కవిత ఇటీవల పార్టీకి రాసిన లేఖలో తనకు జరిగిన అన్యాయాన్ని స్పష్టంగా ప్రస్తావించారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. BRS పార్టీలో తన పాత్రను పూర్తిగా విస్మరిస్తున్నారనే అభిప్రాయం ఆమెలో ఉందని, కేటీఆర్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చినట్లే తనకూ ఇవ్వాలన్నది ఆమె ఆవేదన అని పేర్కొన్నారు.ట్రబుల్ షూటర్‌గా గుర్తింపు పొందిన కేసీఆర్ ఇప్పుడు తానే ట్రబుల్స్‌లో చిక్కుకున్నారని, పార్టీ క్యాడర్ సందిగ్ధంలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. వారి నమ్మకం రోజురోజుకీ తగ్గిపోతుందని, కవిత మాట్లాడుతున్నది ఆమె స్వంత ఎజెండా ప్రకారం కానీ, అది బీఆర్ఎస్‌లో విభేదాలు పెరుగుతున్నందుకు సంకేతం అని మహేశ్వర్ రెడ్డి అన్నారు.బీఆర్ఎస్ పూర్తిగా పతనమవుతోందని, మచ్చలేని నేతలంతా బీజేపీ వైపే చూస్తున్నారని మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. నాలుగు స్తంభాలాటల మధ్య కూలిపోబోతోంది. పదవులు, ఆస్తుల కోసమే అంతర్గత పోరు నడుస్తోంది. కవిత కూడా పార్టీ నుండి బయటకు వెళ్లాలని చూస్తున్నారు," అన్నారు. అలాగే, బీజేపీకి బీఆర్ఎస్‌ను విలీనం చేసుకునే అవసరం లేదని, బీజేపీ ఒంటరిగా తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ముష్కరులకు దీటుగా బదులిచ్చాం



న్యూఢిల్లీ: 'పహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడి, భారతీయులను విభజించాలని కోరుకున్న ముష్కరులకు భారత్ తగిన సమాధానం ఇచ్చిందని' ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ దాడి తర్వాత భారతీయులు మునుపెన్నడూ లేనంతగా ఐక్యతను వ్యక్తం చేశారని అన్నారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసింది కేవలం భారతీయులపై దాడి మాత్రమే కాదు. ఇది మానవత్వంపై జరిగిన దాడి. మన సోదర స్ఫూర్తిపై దాడి. అయితే ఆపరేషన్ సిందూర్ ద్వారా మనం వారికి బలమైన ప్రతిస్పందన చూపామని ప్రధాని మోదీ బాగ్డోగ్రాలో వర్చువల్‌గా జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు.నేడు (గురువారం) జరగాల్సిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సిక్కిం పర్యటన ప్రతికూల వాతావరణం కారణంగా రద్దయ్యింది. సిక్కిం రాష్ట్ర అవతరణ 50వ వార్షికోత్సవ వేడుకలకు ప్రధాని హాజరుకావలసి ఉంది. దీనిలో భాగంగా ఆయన గ్యాంగ్‌టక్ చేరుకుని, రూ. 750 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంది. అయితే ఈ కార్యక్రమాలు వాతావరణం అనుకూలించని కారణంగా రద్దయ్యాయి. దీంతో ప్రధాని మోదీ బాగ్డోగ్రా(పశ్చిమ బెంగాల్) నుండి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సిక్కిం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సిక్కిం ప్రజాస్వామ్య ప్రయాణంలో స్వర్ణోత్సవం అని అన్నారు. తాను రాష్ట్ర ప్రజల సమక్షంలో ఉంటూ, 50 వసంతాల విజయవంతమైన ప్రయాణాన్ని చూడాలనుకున్నానని, అయితే ఢిల్లీ నుండి బాగ్డోగ్రా చేరుకోగానే, అక్కడి వాతావరణం తనను మరింత ముందుకు వెళ్లకుండా ఆపివేసిందని, ఫలితంగా సిక్కిం ప్రజలను వ్యక్తిగతంగా కలిసే అవకాశం దక్కలేదని ప్రధాని మోదీ ?పేర్కొన్నారు.సిక్కిం 50వ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమాన్ని చిరస్మరణీయంగా మలచేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషిచేశారని ప్రధాని అన్నారు. సిక్కిం 50వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ప్రధాని అభినందనలు తెలిపారు. 50 ఏళ్ల క్రితం సిక్కిం తనకు తానుగా ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్ణయించుకుందని, నాడు సిక్కిం ప్రజలు భారతదేశంతో కనెక్ట్ కావాలని కోరుకున్నారన్నారు. ఈ రోజు సిక్కింలోని ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ఉందని ప్రధాని పేర్కొన్నారు. 50 ఏళ్లలో సిక్కిం 100శాతం సేంద్రీయ రాష్ట్రంగా మారిందని, సంస్కృతి, వారసత్వ సంపదకు చిహ్నంగా ఉద్భవించిందని ప్రధాని అన్నారు .2014లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అని చెప్పామని, ఈ స్ఫూర్తితో తమ ప్రభుత్వం ఈశాన్య ప్రాంతాన్ని అభివృద్ధికి కేంద్రంగా మార్చిందని మోదీ పేర్కొన్నారు. నేడు సిక్కిం అభివృద్ధికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయని, ఇది నవ భారత అభివృద్ధిలో ఒక కొత్త అధ్యాయంగా మారనున్నదని మోదీ అన్నారు.

## జైరాం రమేశ్ వివాదస్ప ద వ్యాఖ్యలు...



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత జైరాం రమేష్(జైరామ్ రమేష్) వివాదంపై వ్యాఖ్యలు చేశారు. పెహల్‌గామ్‌లో దాడికి పాల్పడిన ఉగ్రవాదులు అక్కడ, ఇక్కడ ఫ్రీగా తిరుగుతున్నారని, అలాగే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న మన ఎంపీల బృందం కూడా ప్ర పంచ దేశాలు తిరుగుతున్న పెహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులు మరో నాలుగు దాడుల్లో పాల్గొన్నారు. కానీ వాళ్లు స్వేచ్ఛగా తిరుగుతున్నట్లు చెప్పారు. ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ వివాదస్ప ద వ్యాఖ్యలు చేశారు. మన ఎంపీలు, ఉగ్రవాదులు కూడా స్వేచ్ఛగా తిరుగుతున్నట్లు.కాంగ్రెస్ ప్రశ్నలకు బీజేపీ సమాధానం ఇవ్వడం లేదని ఆయన ప్రకటించారు. బీజేపీ కేవలం తమ పార్టీని మాత్రమే టార్గెట్ చేస్తున్నారు. ఉగ్రవాదులను ఆ పార్టీ టార్గెట్ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై అటాక్ చేయడం కాదు, ఉగ్రవాదులను అంతం చేయాలన్నారు.

## సంపాదకీయం

శుక్రవారం 30-05-2025

# ముప్పు అంచున మంచు పర్వతాలు

హిమాలయాలు ఆసియా ఖండ జలశిఖరాలు. భూతాపం సెగలు అంతకంతకూ పెరుగుతుండటంతో అవి కరిగిపోతున్నాయి. ఈ ప్రమాదంపై నేపాల్ ప్రభుత్వం సాగర్‌మాతా సంబాద్/ మౌంట్ ఎవరెస్ట్ డైలాగ్ పేరుతో ప్రారంభించిన చర్చ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. భూతాపంతో విలయాన్ని ఎదుర్కొంటున్న పర్వత శ్రేణులన్నింటి వ్యథల్నీ వెలుగులోకి తెచ్చింది. హిమాలయాలు ఆసియా ఖండ జలశిఖరాలు. భూతాపం సెగలు అంతకంతకూ పెరుగుతుండటంతో అవి కరిగిపోతున్నాయి. ఈ ప్రమాదంపై నేపాల్ ప్రభుత్వం సాగర్‌మాతా సంబాద్/ మౌంట్ ఎవరెస్ట్ డైలాగ్ పేరుతో ప్రారంభించిన చర్చ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. భూతాపంతో విలయాన్ని ఎదుర్కొంటున్న పర్వత శ్రేణులన్నింటి వ్యథల్నీ వెలుగులోకి తెచ్చింది. ఇటీవల కాఠ్‌మాండూ నగరంలో నిర్వహించిన మౌంట్ ఎవరెస్ట్ డైలాగ్ కార్యక్రమం భౌగోళిక, ప్రాంతీయ, జాతీయ ప్రాధాన్యం కలిగిన అనేక అంశాలపై దృష్టి సారించింది. ఇందులో భారత్, చైనా సహా మొత్తం 12 దేశాలకు చెందిన 300 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వీరితోపాటు నేపాల్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థలు, దేశాల ప్రతినిధులూ హాజరయ్యారు. భూతాపాన్ని పెంచే వాయువుల్లో కేవలం 0.027శాతం మాత్రమే నేపాల్‌లో ఉత్పత్తి అవుతున్నాయి. అయినప్పటికీ ఆ దేశం భూతాప వృద్ధి కారణంగా తలెత్తుతున్న పర్యవసానాలను అనుభవిస్తోంది. హిమాలయ పర్వతాల్లోని హిమఖండాలు కరిగి పలుచబారుతున్న ఫలితంగా నేపాల్ నానా బాధలు పడుతోంది.

ముంచుకొస్తున్న సంక్షోభం

హిమానీనదాల ఆకస్మిక విస్ఫోటన కారణంగా వరదలు తలెత్తుతున్నాయి. అకాల వర్షాలు, హిమచరియలు విరిగి పడటం వంటివీ సర్వసాధారణంగా మారాయి. సిక్కింలో 2023లో సంభవించిన వరదలు, నేపాల్‌లోని మెలమ్చి నదికి 2023 జూన్‌లో వచ్చిన వరదలు ఇందుకు ఉదాహరణలు. 'వాతావరణ సంక్షోభం ప్రపంచం ముందున్న అతిపెద్ద ముప్పు. పరిసరాలను పరికించి చూస్తే, మనకు దర్శనమిచ్చేది వృక్ష సంపద కొరవడి నగ్నంగా నిలబడిన పర్వతాలు, తరిగిపోతున్న హిమానీనదాలు, నశిస్తున్న జీవ వైవిధ్యం, తీవ్ర వాతావరణ మార్పులు, పెరిగిపోతున్న సముద్ర జలమట్టాలే. ఈ మార్పులన్నీ స్పష్టంగా చెబుతున్నది ఒకటే. వాతావరణ మార్పు అనేది సుదూరంగా ఉన్న ప్రమాదం కాదు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ఒక వాస్తవం' అన్న నేపాల్ ప్రధాని ఓలీ మాటలు అక్షర సత్యాలు. 'ప్రపంచంలో సగభాగానికి పర్వతాలే జీవన ఆధారాలు. ఆర్కిటిక్ నుంచి ఆండిస్ వరకూ, ఆల్ప్స్ నుంచి హిమాలయాలదాకా పర్వతాలన్నీ జలశిఖరాలే. అవి మన వాతావరణ నాడీ స్పందనలు. అలాంటి వాటికి ఇప్పుడు ముప్పు వచ్చిపడింది' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందూకుష్ పర్వత శ్రేణుల్లో 54 వేల హిమానీనదాలు ఉన్నాయని సమగ్ర పర్వతాభివృద్ధి అంతర్జాతీయ కేంద్రం (ఐసీఐఎంవోడీ) పేర్కొంటోంది. దాదాపు 60 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న ఈ హిమానీనదాలు దక్షిణాసియాలో ప్రవహిస్తున్న అనేక నదులకు జల వనరులు. ఇలాంటి హిమానీనదాలు వేగంగా తరిగిపోవడం శాస్త్రవేత్తలకు ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కొందరు స్థానికులు, శాస్త్రవేత్తలు కాఠ్‌మాండూకు 100 కిలోమీటర్ల దూరంలో లాంగ్‌టాంగ్ లోయలోని యాలా హిమానీనదాన్ని సందర్శించారు. 50 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఇది దాదాపు 66శాతం తరిగిపోయింది. భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా చూడాలన్న పారిస్ ఒడంబడిక నిర్దేశాన్ని పాటించకుంటే అనేక హిమానీనదాలు భూతలం నుంచి అదృశ్యమవుతాయి. భూమిపై, ఇతర ప్రాంతాలతో పోలిస్తే హిమాలయాల్లో భూతాపం రెండింతలు పెరుగుతోంది. ఈ కారణంగా వందలాది హిమానీనదాలు క్షీణిస్తూ అంతర్ధానం అవుతున్నాయి. కొన్నిచోట్ల అవి కరిగిపోయి పెద్దపెద్ద సరస్సులుగా మారుతున్నాయి. భారీ వర్షాలు తదితర సందర్భాల్లో ఇవి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తి పెనువిషాదానికి కారణమవుతున్నాయి.

వాతావరణ దౌత్యం

ప్రపంచవ్యాప్తంగా పర్వతాలు, వాటిపై ఆధారపడిన ప్రజలందరి వ్యథ ఒక్కటే అని భారత పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. పర్యావరణ సంక్షోభం వల్ల తలెత్తుతున్న సమస్యల్లో అధికభాగం హిమాలయాలపై ప్రభావం చూపుతున్నాయని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో గణనీయమైన భూభాగం కలిగి ఉన్న భారత్ దీని పర్యవసానాలను అనుభవిస్తోందన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ లాంటి ప్రముఖ దేశాధినేతల్ని సాగర్‌మాతా సంబాద్ కార్యక్రమానికి ఆహ్వానించాలని నేపాల్ ప్రయత్నించినా ఫలించలేదు. కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ పాల్గొన్నారు. బ్రెజిల్‌లో జరగనున్న కాప్-30 సదస్సుకు ఈ కార్యక్రమం ఊతం అందిస్తుందని నేపాల్ విదేశాంగ మంత్రి ఆర్జు రాణా దేవ్‌బా పేర్కొన్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. వాతావరణ దౌత్యంలో ముందంజలో నిలవాలన్నది ఆ దేశ లక్ష్యం. పర్యావరణ వినాశనాన్ని నిలువరించడం, వాతావరణ న్యాయానికి కృషిచేయడం, బాధిత వర్గాలకు పరిహారం, అంతర్జాతీయ వాతావరణ ఆర్థిక సహకారం తదితర అంశాలు ఈ దౌత్యంలో భాగం కానున్నాయి.

# నోటితో నవ్వి...



న్యూఢిల్లీ,టీం ఇండియా తరహాలో ఒకే జట్టులా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తే అసాధ్యమైన లక్ష్యమేదీ ఉండదని శనివారం నాటి నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ చెప్పిన మాటలు 'నోటితో నవ్వి నొసటితో వెక్కిరించడం' అన్న సామెతను గుర్తు చేస్తున్నాయి. విపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాల పాలనను గవర్నర్ల ద్వారా స్తంభింజేయడం మొదలు ఇటీవలి పహల్గాం ఉగ్ర దాడి, అనంతర భారత్ పాక్ సాయుధ ఘర్షణ గురించి పాలక కూటమి ముఖ్యమంత్రులకు, నాయకులకు మాత్రమే ఆదివారంనాడు వివరించుకున్న ప్రధానమంత్రి నీతి ఆయోగ్ సమావేశంలో మాత్రం గంభీర ఉపన్యాసం చేయడం ఆయనకే చెల్లింది. ప్రజలెన్నుకున్న చట్టసభలు ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్లు నిర్దిష్ట కాలపరిమితిలోగా తమ సమ్మతి తెలపాల్సిందేనని దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పునే రాష్ట్రపతి ద్వారా ప్రశ్నించిన కేంద్ర ప్రభుత్వానికి అధినేత ఆయన! ఇలా చెబుతూపోతే రాష్ట్రాల హక్కుల ఉల్లంఘనకు సంబంధించి కొండవీటి చేంతాడంత జాబితా అవుతుంది. ఇదే 'సహకార ఫెడరలిజం' అని లోకమంతా అనుకోవాలా? పహల్గాం ఉగ్రదాడి, తదనంతర ఆపరేషన్ సిందూర్ తోపాటు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను, ఉగ్రవాదాన్ని ఒంటరిపాటు చేయడానికి వివిధ పార్టీల నేతలను దేశదేశాల్లో తిప్పుతున్న మోడీ సర్కారు ఈ దేశ ప్రజలకు వివరించడానికి అత్యున్నత ప్రజాస్వామిక వేదికయైన పార్లమెంటును మాత్రం సమావేశపర్చడం లేదు. ఇదీ పాలకుల పారదర్శకత!నీతి ఆయోగ్ సమావేశం మరుసటి రోజునే పాలక కూటమి ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం ఆపరేషన్ సిందూర్‌లో భారత సాయుధ దళాల అసమాన ధైర్య సాహసాలను కొనియాడుతూ తీర్మానించింది. పనిలో పనిగా ప్రధాని నరేంద్ర మోడీకి స్తోత్రపాఠాలతో సమావేశం వెల్లువెత్తింది. ఈ సమావేశంలో బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, 19 రాష్ట్రాల నుండి ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం జరిగినట్టు చెబుతున్నా ఆపరేషన్ సిందూర్, దేశ భద్రత సహా పలు అంశాలపైనే ప్రధాన చర్చ నడిచిందన్నది వాస్తవం. ఆపరేషన్ సిందూర్ విజయంలో సాయుధ బలగాలు ప్రదర్శించిన అసమాన ధైర్యసాహ సాలను, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని అభినందిస్తూ ఈ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారికి ఆపరేషన్ సిందూర్ గట్టి సమాధానం ఇచ్చిందని పేర్కొనడం బాగానే ఉంది. కానీ ఇంత ప్రతిష్ఠాత్మక ఆపరేషన్ నిర్వహించిన తరువాత కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారనీ, భారత్ పాక్ ద్వైపాక్షిక వివాదంలో మూడోవారు ఎందుకు జోక్యం చేసుకున్నారన్నది మాత్రం వెల్లడించలేదు. నరేంద్ర మోడీని లేదా అమిత్‌షాను ప్రశ్నించే సాహసం ఎన్‌డిఎ భాగస్వాములెవరూ చేయలేకపోవచ్చు కానీ వాస్తవాలు తెలియజెప్పాల్సిన బాధ్యత కూటమి నాయకత్వానిదే కదా! మిత్ర ధర్మాన్ని సైతం బిజెపి విస్మరించినట్టే భావించవలసి వస్తుంది. లేదు.. అని ఎవరైనా అంటే ట్రంప్ జోక్యంపై ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలి. టీం ఇండియా స్ఫూర్తితో పని చేయాలన్న ఆకాంక్ష వాస్తవమైతే కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటు సమావేశం జరిపి అన్ని విషయాలను వెల్లడించాలి. పారదర్శకంగా ప్రజలకు అన్నీ తెలియజేస్తేనే ఉగ్రవాదానికి వ్యతిరే కంగా భారతీయులందరినీ ఐక్యంగా నిలపడం సాధ్యమవుతుంది. నిజానికి పహల్గాం ఉగ్రదాడి జరిగిన వెనువెంటనే బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో కాశ్మీర్ ప్రజలు- వారిలో అత్యధికులు ముస్లింలు- చూపిన స్ఫూర్తి ఆదర్శవంత మైనది. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు యావద్భారతావని ఏకతాటిపై ఉగ్రవాదానికి, వారిని ప్రోత్సహించేవారికీ వ్యతిరేకంగా నిలిచింది. ఆ స్ఫూర్తికి తూట్లు పొడిచేలా మధ్యప్రదేశ్ మంత్రి, ఉప ముఖ్యమంత్రి, తాజాగా బిజెపి ఎంపి రామచంద్ర జాంగ్రా వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. సాక్షాత్తూ సుప్రీం కోర్టు తలంటినా బిజెపి అధిష్టానం కానీ కేంద్ర ప్రభుత్వం కానీ ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం ఏ సంకేతాలనిస్తుంది? పాలకులు తగు దిద్దుబాటు చర్యలు తీసుకోవడం అవశ్యం!

# ఐటీలో కేటీఆర్‌కు అదే క్రేజ్...

హైదరాబాద్,తమ్ముడు ముఖ్యమంత్రిగా ఉంటేనే అన్నదమ్ముల హవా కొనసాగుతున్న కాలం ఇది. అలాంటిది తండ్రి ముఖ్యమంత్రిగా ఉండి.. ఆ తండ్రి ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతూ అధికారంలో ఉన్న పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండే వ్యక్తి ప్రభావం ఏ స్థాయిలో ఉంటుంది? సాధారణ పరిస్థితుల్లో అయితే ఊహించటం పెద్ద కష్టమేమీ కాదు. ఆ నాయకుడిని మచ్చిక చేసుకోవటానికి, ప్రసన్నం చేసుకోవ టానికి వ్యక్తులు, సంస్థలు పోటీపడటం సహజం. అధికారం లేనప్పుడూ ఆ నాయకుడికి దేశ, విదేశాల్లో అదే గౌరవం, అదే మర్యాద దక్కటం ఎలా సాధ్యం? అంటే అధికారం ఉన్నా లేకపోయినా నిరంతరం తనలో సహజసిద్ధంగా ఉన్న అధ్యయనం, కార్యశీలత, కమిట్‌మెంట్, విషయ నైపుణ్యంతోపాటు అధికారంలో ఉన్నప్పుడు తన రాష్ట్రానికి తన చొరవ, ముందుచూపుతో చేసిన పనులు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలు కారణమని చెప్పాలి. ఆ అరుదైన ఆవిష్కరణ తెలంగాణది అయితే, ఆ ఆవిష్కరణల వెనుక దాగిన కార్యశీలత కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ది. కేటీఆర్ సుదీర్ఘకాలం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో దేశ, విదేశీ సంస్థల నుంచి ఆహ్వానాలు అందాయి. అధికారంలో ఉన్నపార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంటే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలకు తన పనితీరుతో జాతీయ, అంతర్జాతీయ ఇమేజ్‌ను తెచ్చారనటంలో ఎవరికీ అభ్యంతరం లేదు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో ప్రైవేట్ రంగంలో 16 లక్షలకుపైగా ఉద్యోగాల కల్పన జరిగింది. పెట్టుబడులూ అదే దామాషాలో రాష్ట్రానికి వచ్చాయి. దేశ, విదేశాల్లో ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాలకు కేటీఆర్ తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. అందువల్లే అధికారం లేకపోయినా కేటీఆర్‌కు దేశ, విదేశాల్లో అదే క్రేజీ..అదే ఇమేజ్ కొనసాగుతు న్నది. సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణను అన్నిరంగాల్లో తిరుగులేని శక్తిగా రూపొందించుకోవాలనే బలమైన లక్ష్యంతో కేసీఆర్ పాలన కొనసాగింది. తెలంగాణను బాగు చేసుకోవాలనే తపన, భవిష్యత్తును ఊహించే దార్శనికత, తెలంగాణ ప్రజల అవసరాలను అర్థం చేసుకోగలిగే మనసు, అంతకు రెట్టింపు తెలంగాణను అమితంగా ప్రేమించగలటం వల్ల కేసీఆర్ హయాం అద్భుత ఫలితాలు సాధించింది. కేసీఆర్ టీంలో ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖలను నిర్వహించిన కేటీఆర్‌కు అధికారం లేకపోయినా దేశ, విదేశాల్లో అదే గౌరవం దక్కుతుందనటానికి కేరళలోని కొచ్చిలో ఈ జనవరిలో జరిగిన 'ది ఇండస్ ఆంత్రప్రెన్యూర్స్' (టీఐఈ) సదస్సే నిదర్శనం. ఆ సదస్సులో కేటీఆర్‌ను ఐటీ మంత్రిగా సంబోధించారు. తాను 'ఐ టీ శాఖ కాదు అసలు మంత్రినే కాను' అని కేటీఆర్ వారించినా నిర్వాహకులు 'మేము మాత్రం మంత్రిగా నే భావిస్తాం' అని చెప్పేశారు. అలాగే దేశంలోనే అత్యుత్తమ ఇంజినీరింగ్ విద్యాసం స్థల్లో మొదటి వరుసలో నిలిచే ఐఐటీ మద్రాస్ ఏటా నిర్వహించే ఆంత్రపెన్యూరల్ ఫెస్టివల్ ఈ- సమ్మిట్‌లో ఇటీవలే కేటీఆర్ కీలకోపన్యాసం చేశారు. అక్కడా అదే ఆదరణ, అభిమానం. ఇక లండన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ ఆటోమొబైల్ -ఇంజినీరింగ్ సర్వీసెస్ సంస్థ ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ యూకేలోని -వార్విక్ టెక్నాలజీ పార్ ఏర్పాటుచేసిన తమ నూతన కేంద్రాన్ని ప్రారంభించాలని కేటీఆర్‌ను ఆహ్వానించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన, అత్యంత విలువైన కారు బ్రాండ్ అయినా మైక్లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి ప్రముఖ ఆటో దిగ్గజాలకు ఆ సంస్థ సేవలందిస్తున్నది. తెలంగాణ రాష్ట్రాన్ని ఐటీ, ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా



తీర్చిదిద్దిన ఘనత కేటీఆర్‌దని ఆ సంస్థ ఆహ్వాన పత్రంలో ముద్రించింది. బ్రిటన్‌లో జరిగే 'ఐడియాస్ ఫర్ ఇండియా-2025' సదస్సుకు అతిథిగా రావాలని 'బ్రిడ్జ్ ఇండియా' సంస్థ కేటీఆర్‌ను ఆహ్వానించింది. ఈ 30వ తేదీన లండన్‌లోని రాయల్ లాంకాస్టర్‌లో జరిగే సదస్సులో ముఖ్య వక్తగా ప్రసంగించాలని కోరింది. 2023లో కేటీఆర్ చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకున్నదని, ఆ ప్రసంగం కొత్త ఆలోచనలకు పురిగొల్పిన కారణంగానే ఈసారి కూడా తాము కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నామని ఆ సంస్థ నిర్వాహకులు ఓపెన్‌గానే చెప్పారు. 'తెలంగాణలో ప్రభుత్వం మారినప్పటికీ కేటీఆర్‌ను ప్రత్యేకంగా ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు ఆహ్వానిస్తున్నామని బ్రిడ్జ్ ఇండియా ఫౌండర్ ప్రతీక్ దత్తానీ కేటీఆర్‌కు రాసిన లేఖలో పేర్కొనటం గమనార్హం. అలాగే వచ్చే నెల (జూన్) 20, 21వ తేదీల్లో ఇంగ్లండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ అంతర్జాతీయ సదస్సుకు హాజరుకావాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో తెలంగాణలో అమలుచేసిన వినూత్న విధానాలు, సాంకేతిక ఆధారిత అభివృద్ధి నమూనాల ఆచరణ అనుభవాలను వివరించాలని ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం నిర్వాహకులు కేటీఆర్‌ను కోరారు. తెలంగాణ రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చడంలో, హైదరాబాద్ అనేక అంతర్జాతీయ ఐటీ కంపెనీలను స్థాపించడంలో కేటీఆర్ చేసిన కృషి, టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్ వంటి వినూత్న కార్యక్రమ స్టార్టప్‌ల సృష్టిలో అనుసరించిన వైఖరిని వివరించాలని ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం కోరింది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు కేటీఆర్‌ను ఐకానిక్‌గా చూడటం వెనుక బలమైన నేపథ్యం ఉన్నది. ఐటీ రంగంలో తెలంగాణ సాధించిన విజయగాథ. దానికి భూమిక కేసీఆర్ నాయకత్వంలో రూపొందిన టీఎస్ ఐపాస్ విధానం. వీటికితోడు 2017లో జరిగిన గ్లోబల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో నాటి ఐటీ శాఖమంత్రిగా కేటీఆర్ ప్రదర్శించిన చొరవ, ఆ సమ్మిట్‌లో ఆయన వాక్పటిమకు నాటి (ప్రస్తుతం కూడా) అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్ ముగ్ధురాలయ్యారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ సతీమణి చెర్రీ, నాటి డెల్ ఈఎంసీ కరేన్ క్వింటోస్ వంటి ఎంతోమంది కేటీఆర్ విజన్‌కు ఫిదా అయ్యారు. అలా తెలంగాణ ఐటీ రంగానికి ఒక్కొక్కటిగా పడిన అడుగుల ఫలితంగా హైదరాబాద్ దేశంలోనే కాకుండా ప్రపంచ ఐటీపటంలో చిరస్థాయిగా నిలిచేలా చేసింది. ఐటీ ఉత్పత్తుల్లో తెలంగాణ సాటిలేని మేటి రికార్డును సృష్టించటం వెనుక కేటీఆర్ చోదకశక్తిగా పనిచేశారని దేశ, విదేశం గుర్తిస్తున్నది. కీర్తిస్తున్నది. ఆ కీర్తికిరిటాలనే తమకు అనుభవపాఠాలుగా చెప్పాలని ఆయనను సంస్థలు ఆహ్వానిస్తున్నాయి. అదీ తెలంగాణకు దక్కుతున్న గౌరవం.

# ఎపిలో నైరుతి రాకతో భారీ వర్షాలు

అమరావతి, నైరుతి ఋతుపవనాలు బుధవారం నాటికి ఆంధ్రప్రదేశ్ అంతటా పూర్తిగా విస్తరించాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో భారీ వర్షాలతో పాటు-గా ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే ఛాన్స్ ఉన్నందున గోదావరి, నాగావళి, వంశధార నదీ పరివాహక లోతట్టు- ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై వరద ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగానికి ఇప్పటికే సూచనలు జారీ చేశామని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా, హోం,విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల ప్రకారం నదీ తీరాలు, సరస్సులు, చెరువులు, కాలువల్లో మునిగిపోయే ప్రాంతల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు-చేయాలని జిల్లా కలెక్టర్లకు ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలు జారీ చేసినట్లు- తెలిపింది. ఈ హెచ్చరిక బోర్డుల్లో భద్రతా సూచనలు, సహాయం కోసం అత్యవసర నెంబర్ల సమాచారం ఉంచాలని వెల్లడించింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ ఉందన్నారు. అయితే, శుక్రవారం (మే30) నాడు అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ

# అమెరికా టారిఫ్‌ల వెనుక అసలు కథ!

న్యూఢిల్లీ,ప్రపంచ వాణిజ్య ముఖచిత్రం వేగంగా మారిపోతుంది. ఒకప్పుడు చైనా ప్రపంచానికే కర్మాగారంగా భావించబడేది. కానీ, ఇప్పుడు అమెరికా, చైనాల మధ్య సాగుతున్న వాణిజ్య యుద్ధం, వాటి విధానపరమైన మార్పులు అనేక దేశాలకు, ముఖ్యంగా భారత్‌కు అనూహ్యమైన అవకాశాలను తీసుకొస్తున్నాయి. అమెరికా తన దిగుమతి విధానాల్లో తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు, ముఖ్యంగా చైనాపై విధించిన టారిఫ్‌లు, ఇతర దేశాల నుంచి ఉత్పత్తిని ప్రోత్సహించేలా చేస్తున్నాయి. ఈ పరిణామాలు భారతీయ కంపెనీలకు ఎలా లాభం చేకూరుస్తున్నాయి, అంతర్జాతీయ వాణిజ్య రంగంలో భారత్ స్థానం ఎలా బలపడుతోందో ఈ కథనంలో తెలుసుకుందాం.

చైనా స్థానాన్ని భర్తీ చేస్తున్న భారత్?

అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగే కొద్దీ, అనేక అంతర్జాతీయ కంపెనీలు తమ ఉత్పత్తి కేంద్రాలను చైనా నుంచి ఇతర దేశాలకు మార్చాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ ఒక ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. ఇక్కడ తక్కువ ఉత్పత్తి ఖర్చులు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి, పెరుగుతున్న వినియోగదారుల మార్కెట్ వంటి అంశాలు అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షిస్తున్నాయి. డిక్సన్ టెక్నాలజీస్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, బ్లూ స్టార్, హావెల్స్ వంటి భారతీయ దిగ్గజాలు ఇప్పటికే ఈ మార్పుల నుండి లబ్ధి పొందుతున్నాయి.

ఆర్డర్ల వెల్లువ

అమెరికాలోని తమ భాగస్వాముల నుంచి ఈ భారతీయ కంపెనీలకు కొత్త ఆర్డర్లు భారీగా వస్తున్నాయి. డిక్సన్ టెక్నాలజీస్ వంటి సంస్థలు ఈ డిమాండ్‌ను అందుకోవడానికి తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని 50శాతం వరకు పెంచుకుంటున్నాయి. టెక్నాలజీ దిగ్గజాలు కూడా భారత్ వైపు చూస్తున్నాయి. ఉదాహరణకు, గూగుల్ వంటి కంపెనీలు తమ హ్యాండ్‌సెట్‌లను భారత్ నుంచి ఎగుమతి చేయాలని ఆలోచిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది 'మేడ్ ఇన్ ఇండియా' బ్రాండ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి ఎంతో దోహదపడుతుంది. హావెల్స్ వంటి సంస్థలు ఇప్పటికే భారత్‌లో తయారైన ఎయిర్ కండిషనర్‌లను అమెరికాకు ఎగుమతి చేయడం ప్రారంభించాయి. టాటా కన్స్యూమర్ వంటి ఎఫ్ఎమ్‌సిజి కంపెనీలు కాఫీ, టీ వంటి ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయడంలో తమ పోటీ స్థానాన్ని పటిష్టం చేసుకుంటున్నాయి. అమెరికాలో ఈ ఉత్పత్తులు ఉత్పత్తి కానందున, భారతీయ ఉత్పత్తులకు మంచి అవకాశం లభిస్తోంది.

ఆర్థిక వృద్ధికి కొత్త ఊతం

ఈ వాణిజ్య మార్పులు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. భారతీయ కంపెనీల ఆదాయం పెరుగుతోంది.. లాభాలు మెరుగుపడుతున్నాయి. టెక్స్‌టైల్ రంగం వంటివి కూడా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మరింత వృద్ధిని సాధించవచ్చని అంచనా వేస్తున్నారు. అమెరికాతో కుదరనున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కూడా భారత ఎగుమతులకు మరింత ఊపునిస్తుంది. ఇవన్నీ కలిసి మన దేశీయ పరిశ్రమలకు కొత్త రెక్కలు తొడిగి, ప్రపంచ వాణిజ్య పటంలో భారత్‌ను మరింత ఉన్నత స్థానంలో నిలబెడతాయి. అంతర్జాతీయ రాజకీయాలు, వాణిజ్య విధానాల్లో వస్తున్న మార్పులు భారత్‌కు ఒక సువర్ణావకాశాన్ని అందిస్తున్నాయి.

# సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసిన జగన్

కడప,రాయలసీమకు ఏ ముఖ్యమంత్రి చేయని ద్రోహం.. దగా.. గత ప్రభుత్వంలో జగన్ చేశారని ఏపీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. జగన్ ఐదేళ్ల పాలనలో నీటిపారుదల రంగం ధ్వంసం అయ్యిందన్నారు. పోలవరం నిర్మాణం నిలిచి పోయిందన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో 'సమగ్ర సాగునీటి ప్రణాళికలతో ఉజ్వల ప్రగతి' అనే అంశంపై జరిగిన చర్చలో రామానాయుడు మాట్లాడారు. 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వం రాయలసీమలో ఇరిగేషన్‌కు రూ. 12వేల కోట్లు- ఖర్చు చేస్తే గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ. 2వేల కోట్లు మాత్రమే వెచ్చించింది. ఏ ప్రాజెక్టుకూ కేటాయించని విధంగా సీఎం చంద్రబాబు.. హంద్రీనీవాకు బడ్జెట్‌లో రూ. 3,800 కోట్లు- కేటాయించారు. 2025 జులై నాటికి హెచ్ఎన్ఎస్ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశిరచారు. వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు ప్రతి నీటి బొట్టు-ను ఒడిసి పట్టి నిల్వ చేసుకోవాలని సీఎం చంద్రబాబు ఎప్పుడూ చెబుతుంటారు. ఆయన సూచనల మేరకు రాయలసీమ రిజర్వాయర్లలో 261 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగాం. రాయలసీమను రతనాల సీమగా మార్చాలనేదే చంద్రబాబు ఆలోచన. గోదావరి నుంచి ఏటా 3వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి పోతోంది. అందులో నుంచి 200 టీఎంసీల నీరు తీసుకొని తెలుగు తల్లికి జలహారతి కింద 3 దశల్లో పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేస్తే 80లక్షల మందికి తాగునీరు లభిస్తుంది. 7.2లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 22.28 లక్షల ఎకరాల ఆయకట్టు- స్థిరీకరణ జరిగే అవకాశముంటుంది. పోలవరం-బనకచర్ల పూర్తయితే రాయలసీమ మొత్తం పచ్చని పైర్లతో కళకళలాడుతుందని నిమ్మల రామానాయుడు అన్నారు.

## భగ్గుమన్న కన్నడిగులు

బెంగళూరు,తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. తాను నటించిన థగ్‌లైఫ్ సినిమా ఆడియో విడుదల సందర్భంగా చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నా జీవితం, నా కుటుంబం తమిళ భాష' అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై కన్నడిగులు మండిపడు తున్నారు. తాజాగా ఈ వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. ఈ మేరకు నటుడి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కన్నడ పుట్టుకకు తమిళంతో సంబంధం లేదని పేర్కొన్నారు. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉందని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్‌కు ఆ విషయాలన్నీ తెలియవంటూ ఎద్దేవా చేశారు. కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు. 'శివరాజ్‌కుమార్ వేరే రాష్ట్రంలో నివసిస్తున్నా నా కుటుంబ సభ్యుడు. అందుకే ఆయన ఈ రోజు ఇక్కడ ఉన్నారు. అందుకే నా ప్రసంగం మొదలుపెట్టేటప్పుడు.. నా జీవితం, నా కుటుంబం తమిళ భాష అని చెప్పా. మీ భాష (కన్న) తమిళ నుంచే పుట్టింది. ఆ విధంగా మీరు భాగస్వామి అయ్యారు' అని శివరాజ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నారు.

## గత 30 ఏళ్లుగా వరుసగా ఎన్నికవుతూ వస్తున్న చంద్రబాబు

కడప,తెదేపా జాతీయ అధ్యక్షుడిగా మరోసారి చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మహానాడు వేదికగా పార్టీ ఎన్నికల కమిటీ ఛైర్మన్ వర్ల రామయ్య ప్రకటించారు. అనంతరం ఆయన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీనేతలు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. 1995లో మొదటి సారిగా చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టారు. గత 30 ఏళ్లుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెదేపాలో ప్రతి రెండేళ్ల కోసారి అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుంది. టీ-డీపీ నాయకులంతా ఆయన్ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 1995లో చంద్రబాబు తొలిసారి తెలుగుదేశం పార్టీ పగ్గాలు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికవుతున్నారు. మహానాడు రెండవ రోజున పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి చంద్రబాబు నామినేషన్లను పలువురు నేతలు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలకు పార్టీ నేతలంతా మద్దతు తెలిపారు. దీంతో చంద్రబాబు నాయుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. చంద్రబాబును జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల కమిటీ ఛైర్మన్ వర్ల రామయ్య మహానాడు వేదికపై ప్రకటించారు. చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టాక.. కడపతో కలుపుకుని ఇప్పటి వరకు 25 మహానాడులు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో రెండేళ్ళ జూమ్ ద్వారా మహానాడు నిర్వహించారు. చంద్రబాబును 12వ సారి టీడీపీ అధినేతగా మహానాడు ఎన్నుకుంది. అనంతరం జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చంద్రబాబుతో వర్ల రామయ్య ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. దేవుడు ఇచ్చిన శక్తితో పార్టీని సమర్థంగా నడిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. మరోసారి జాతీయ అధ్యక్షుడిగా ఎన్ని-కైన అనంతరం మహానాడులో శ్రేణులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. నా ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. తెలుగు జాతి ఉన్నంత వరకు తెదేపా ఉంటుంది. నా బలం, బలగం తెదేపా. నాపై కార్యకర్తలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. మహానాడులో ఆరు శాసనాలపై అర్థవంతంగా చర్చలు జరిగాయి. రాబోయే 40 ఏళ్లకు ప్రణాళిక రచించుకున్నాం. నక్సలిజం రూపుమాపి దానికి నిరంతరం పోరాడిన పార్టీ తెదేపా. రాయలసీమలో ఫ్యాక్షనిజం తుదముట్టించి అభివృద్ధికి బాటలు పరిచాం. రాయలసీమ రాళ్ల సీమ కాదు..రత్నాల సీమగా మారుస్తానని చెప్పాం. కోనసీమ కంటే సంపదలో అనంతపురం ముందుండడానికి తెదేపా కారణం. హైదరాబాద్లో మత ఘర్షణలను పూర్తిగా కట్టడి చేశాం. తెదేపా అధికారంలో ఉంటే అందరికీ రక్షణ ఉంటుంది. 2027 నాటికి పోలవరం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. హంద్రీనీవా కింద చివరి భూములకు నీళ్ల కోసం రూ.3,800 కోట్లు- ఖర్చు చేశాం. పోలవరం తర్వాత హంద్రీనీవాకు భారీగా ఖర్చు చేస్తున్నాం. వెలిగొండతో పాటు- మిగతా ప్రాజెక్టులను పూర్తి చేస్తాం అని చంద్రబాబు అన్నారు.

## తెలుగు తమ్ముళ్ల ధర్మ పోరాటం..!

ధర్మ వరం:ఆ నియోజకవర్గంలో ఏం జరుగుతోంది? మిగతా చోట్ల అన్నింటికంటే అక్కడే టీడీపీ శ్రేణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఎందుకు టీడీపీ శ్రేణులకు ఇబ్బందులు తప్పడం లేదనే ప్రచారం జరుగుతోంది? వైసీపీలో కూడా ఇన్ని ఇబ్బందులు పడలేదు అని ఎందుకు అంటున్నారు నేతలు? ఓపిక నశిస్తే అరచేయి ఆయుధం అవుతుందం టూ ఆ యువనేత ఎందుకు అన్నాడు? ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం తెలుసుకోవాలంటే మనం ధర్మవరంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం టీడీపీకి పెట్టని కోట. టీడీపీ ఆవిర్భావం నుంచి రెండు సార్లు తప్పించి ఇక అన్ని సార్లు విజయం ఆ పార్టీదే. కానీ 2024 ఎన్నికల్లో అనూహ్యంగా ఇక్కడ బీజేపీతో పొత్తు కుదిరి టికెట్ ఎవరికి అంతు చిక్కకుండా సత్య కుమార్ ఎగరేసుకొని పోయారు. అదే ఊపులో ధర్మవరంలో కాషాయ జెండా రెపరెపలాడింది. టీడీపీ, జనసేన కార్యకర్తలు సహాకరించడంతో మంచి మెజార్టీతో గట్టెక్కారు సత్య కుమార్. ఇదే ఊపులో ఊహాకందకుండా మంత్రి పదవి కూడ సొంతం చేసుకున్నారు.ంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాత కొద్దికొద్దిగా విబేధాలు మొదలయ్యాయి. క్షేత్ర స్థాయిలో పదవుల పంపకం దగ్గరి నుంచి అనేక సార్లు విబేధాలు బయటపడ్డాయి. కానీ అవి కేవలం కార్యకర్తల వరకే ఉండడంతో మీడియా వరకు రాలేదు. మొదటిసారి ఓ అధికారి విషయంలో ఇరు పార్టీల నాయకులు వీధికెక్కారు. మునిసిపల్ కమిషనర్గా మల్లికార్జునని నియమించడం దగ్గరి నుంచి అన్ని విబేధాలే. వరుస పెట్టి కూటమి పార్టీల మధ్య విబేధాలు జరుగుతున్నాయి. దీనిని అనేక మార్లు మంత్రి సత్య కుమార్, పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్చార్జి చిలకం మధుసూదన్ రెడ్డి ఖండించిన ఆ విబేధాలు మాత్రం ఆగడం లేదుఅసలు ఈ విభేదాలకు కారణం ఎంటా అని ఆరా తీస్తే ఓ ఆసక్తికర విషయం బయటపడింది. ధర్మవరం మంత్రి సత్య కుమార్ ప్రజా కార్యక్రమాలతో బిజీగా ఉండటంతో ఇక్కడ ఇన్చార్జ్ బాధ్యతలు హరీష్ బాబుకు అప్పగించారు. ధర్మవరంలో మంత్రికి సంబంధించిన ఏ కార్యక్రమం అయినా అది ప్రజా కార్యక్రమమైన పార్టీ కార్యక్రమమైన మొత్తం హరీష్ బాబు చూసుకుంటారు. అదేవిధంగా ధర్మవరంలో బీజేపీ బలపడేందుకు హరీష్ బాబు మొత్తం కార్యాచరణ రూపొందిస్తూ గ్రామాలు వార్డుల్లో ఎవరైతే బలమైన బీసీ నేతలు ఉంటారో.. వారు ఏ పార్టీ అయినా సరే బీజేపీ కండువా కప్పుతూ పార్టీలోకి చేర్చుకుంటున్నారు.వరుసగా వైసీపీ నేతలను బీజేపీలోకి చేర్చుకుంటూ ఉండగా.. రెడ్డి సామాజికవర్గ నేతలు మాత్రం జనసేన బాట పడుతున్నారు. ఇలా గత ఐదేళ్లు రాజభోగం అనుభవించిన వైసీపీ నేతలు ఇప్పుడు మరోసారి పార్టీ మారి బీజేపీలోనో లేక జనసేనలోనో చేరి తమ కాలం గడుపుకుంటున్నారట. ఇది టీడీపీ నేతలకు.. క్షేత్రస్థాయిలోని కార్యకర్తలకు ఏమాత్రం రుచించడంలేదట. ఇన్నాళ్లు తాము కష్టపడితే ఇప్పుడు వైసీపీ నేతలు తాపీగా ఆ రెండు పార్టీల్లో చేరి అన్ని పనులు చేసుకుంటున్నారనేది టీడీపీ కార్యకర్తల ఆవేదన. ఈ కార్యకర్తల ఆక్రోషం ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ వరకు చేరింది. ఇటీవల జరిపిన మినీ మహానాడులో శ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధర్మవరం ప్రాంతం నాకు చాలా ఓపిక నేర్పించిందని అందుకోసమే చాలా ఓపికతో ఉన్నానని లేదంటే నా ఒరిజినల్ లోపల అలానే ఉందంటూ పార్టీ మారుతున్న వైసీపీ నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. యుద్ధం వచ్చినప్పుడు అరచేయి ఆయుధం అవుతుందని ఇది అందరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. టీడీపీ కార్యకర్తలు ఏం చేసినా దాని వెనుక తానే ఉంటానంటూ మినీ మహానాడు సాక్షిగా కార్యకర్తలకు ధైర్యం నింపారు. నాయకుడంటే పదిమంది వెనకాల ఉండేవాడు కాదని పదిమందిని ముందుకు నడిపించేవాడని.. ఒకవేళ అలా లేకుంటే చచ్చిన శవంతో సమానమని పరిటాల శ్రీరామ్ అలా ఉండలేదని కీలక వ్యాఖ్యలు చేశారు.హిందూపురం పార్లమెంట్ పరిధిలో జరిగిన జిల్లా మహానాడులో కూడా ధర్మవరం గురించి టాపిక్ వచ్చింది. జిల్లాలో టీడీపీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్న ప్రాంతం ధర్మవరం అని వారికి న్యాయం జరిపేలా మనం అందరం చూడాలన్నారు టీడీపీనేతలు. ధర్మవరం టీడీపీ శ్రేణుల్లో ధైర్యం నింపే బాధ్యత మనపై ఉందని సత్యసాయి జిల్లా టిడిపి నేతలు వ్యాఖ్యానించారు. ఇటు ధర్మవరం మహానాడులో అటు జిల్లా మహానాడులో కూడా ధర్మవరం గురించి చర్చ రావడంతో కడపలో జరిగే మహానాడుపై ధర్మవరం టిడిపి కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

# మళ్లీ కరోనా కలకలం



న్యూఢిల్లీ,మరోసారి కరోనా మహమ్మారి కలకలం సృష్టిస్తోంది. దేశంలో అంతకంతకూ పెరుగుతున్న కేసుల సంఖ్య సహజంగానే అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది. ఐదేళ్ల కిందట విశ్వమంతటా విస్తరించి, లక్షలాది ప్రాణాలను కబళించిన ఈ పెనువ్యాధి పేరు వింటే ఇప్పటికీ వెన్నులో వణుకు పుడుతుంది. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్-19 వైరస్కు బలైన వారి సంఖ్య 70 లక్షల పైచిలుకే. అంతటి ప్రాణాంతక వ్యాధి కోరలు సాచి వస్తోందంటే ఎవరికి మాత్రం భయం కలగదు? సింగపూర్, హాంకాంగ్ దేశాలలో మొదలైన ఈ వైరస్ వ్యాప్తి రెండు వారాలు గడిచేసరికి ఇండియా గడప దాటి లోపలకు ప్రవేశించింది. ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలలో పదుల సంఖ్యలో ఈ వైరస్ బారినపడినట్లు వార్తలు వినవస్తున్నాయి.ఒక్క కేరళలోనే 430 కేసులు బయటపడినట్లు తెలుస్తోంది. హైదరాబాద్లో ఒక వైద్యుడికే కరోనా సోకినట్లు వచ్చిన వార్తలు కలవరం కలిగిస్తున్నాయి. ఇప్పటివరకూ వెయ్యికి పైగానే కేసులు వెలుగు చూసినట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ లెక్కగట్టింది. గతంలో మారణ హెూమం సృష్టించిన ఒమిక్రాన్ వైరస్సే ఇప్పుడూ వ్యాపిస్తున్నా, దాని ఉప వేరియంట్లే ప్రధానంగా వ్యాప్తిలో ఉన్నాయని, వాటివల్ల ప్రమాద తీవ్రత అంతగా ఉండదనీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) డైరెక్టర్ జనరల్ స్వయంగా పేర్కొనడం ఉపశమనం కలిగించే విషయం. ఒకప్పుడు రెండు రోజుల్లోనే వైరస్ల సంఖ్య రెట్టింపు అయ్యేవి.కాగా ప్రస్తుతం వాటి వ్యాప్తిలోనూ, సంఖ్యలోనూ వేగం కనిపించడం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎల్ఎఫ్ 7, ఎన్ బి 1.8.1 అనే కొత్త వేరియంట్లు ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నట్లు ఇండియన్ జెనోమ్ కన్సార్షియం గుర్తించింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ సైతం ఇప్పటివరకూ ఎలాంటి మార్గదర్శకాలూ విడుదల చేయకపోవడాన్ని బట్టి చూస్తే ఇప్పటి వైరస్ ప్రభావం అంతంత మాత్రమేనని స్పష్టమవుతోంది. వాతావరణ పరిస్థితులు, సామూహికంగా మసలడం, ప్రయాణాలు పెరగడం వంటివి కేసుల పెరుగుదలకు కారణం కావచ్చనేది వైద్యనిపుణుల అనుమానం. గతంలో కోవిడ్ ప్రబలినప్పుడు అంతా అయోమయ వాతావరణం నెలకొని ఉండేది. ఏ జబ్బో, ఎలా సోకిందో అర్థం కావడానికి చాలా రోజులు పట్టింది.కరోనా వైరస్ను గుర్తించేలోగానే ఒకరినుంచి ఒకరికి పాకి, ప్రపంచమంతటా విస్తరించి మానవాళిని చుట్టుముట్టి ప్రాణాలు బలితీసుకుంది.అకస్మాత్తుగా ఊడిపడిన ఈ వైరస్ భరతం పట్టే విధంగా వ్యాక్సిన్ రూపొందించేందుకూ చాలా రోజులే పట్టింది. కరోనా నేర్పిన గుణపాఠాలతో ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్య పరిశోధనా సంస్థలు సైతం చెట్టుకొకటి, పుట్టకొకటిగా పుట్టుకొస్తున్న ప్రాణాంతక వైరస్లపై అనుక్షణం ఒక కన్నువేసి ఉంచుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వ్యాపిస్తున్న కరోనా వైరస్ వల్ల అంతగా ప్రమాదం లేదంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు కేంద్ర ఆరోగ్య వైద్యశాఖ ఇస్తున్న భరోసాను విశ్వసించ వచ్చు.అలాగే, ప్రస్తుతం కరోనా బారినపడినవారు రుచి, వాసన కోల్పోకపోవడం ఊరట కలిగించే విషయం. అలాగని ప్రాథమిక జాగ్రత్తలు పాటించకపోవడం ప్రాణాంతకంగా పరిణమించవచ్చు. వ్యక్తిగత శుభ్రత పాటించడం, ఒకరినుంచి ఒకరు కనీసం ఐదారు అడు గుల దూరం మసలడం, మాస్కు ధరించడం, వీలైనంత వరకూ సామూహిక ప్రయాణాలకు స్వస్తి చెప్పడం వంటి స్వీయ జాగ్రత్తలు పాటించడం అత్యవసరం. దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికీ ఈ వైరస్ సోకే ప్రమాదం ఉందంటూ వైద్య నిపుణులు చేస్తున్న హెచ్చరికలు గమనార్హం. గొంతు నొప్పి, దగ్గు, అలసట, జ్వరం వంటి కరోనా ప్రాథమిక లక్షణాలు ఉన్నట్లు గమనిస్తే, వెంటనే వైద్యుల్ని సంప్రదించడం ఉత్తమం. నిర్లక్ష్యం చేస్తే పక్కనున్నవారికి కూడా వైరస్ సోకే ప్రమాదం ఉందన్న సంగతి విస్మరించరాదు.మరోవైపు ప్రభుత్వాలు సైతం కరోనా వైరస్ నివారణకు వినియోగించే మందులతో ఆస్పత్రులను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిపుష్టం చేయాలి. కీడెంచి మేలెంచమన్నట్లు ప్రస్తుతానికి బూస్టర్ డోస్లు అవసరం లేదని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ చెబుతున్నా, పరిస్థితి చేయి దాటితే వినియోగించేందుకు టీకాలను సిద్ధంగా ఉంచడం మేలు. గతంలో టీకాలు తీసుకోనివారిని గుర్తించి వారికి తక్షణం టీకాలు ఇప్పించేందుకు కార్యాచరణ ఆరంభించాలి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధుల విజృంభణ పెరుగుతుందన్న వాస్తవాన్ని గమనంలో ఉంచుకుని, వైద్య ఆరోగ్య శాఖాధికారులు నడుం బిగించడం శ్రేయస్కరం.

## జూన్ 2న రాజీవ్ యువ వికాస కార్యక్రమం

హైదరాబాద్,రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అన్ని జిల్లాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లా ఇన్చార్జి మంత్రులకు లబ్ధిదారుల జాబితాను సమర్పించి వారి అనుమతితో జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. బుధవారం భట్టి విక్రమార్క, రాష్ట్ర బి.సి.సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆశలను ముందుకు తీసుకు వెళ్లే క్రమంలో గౌరవ ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా భావించి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5 లక్షల మంది యువతకు 6 వేల 250 కోట్లతో స్వయం ఉపాధి కల్పించ నున్నారని భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, లబ్ధిదారులకు నిజమైన లబ్ధి చేకూరే విధంగా యూనిట్ల ఎంపిక ఉండాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తద్వారా ఎంచుకున్న యూనిట్ల ద్వారా యువతి యువకులకు ఆదాయ వనరుగా, లబ్ధిదారుని కుటుంబం ఆర్థికంగా బలపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకం తొడ్పడాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దశల వారిగా జరిగే లబ్ధిదారుల ఎంపిక పక్రియలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు శిక్షణ, క్షేత్ర స్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్ వరకు అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి తో పాటు- రాష్ట్ర జి.డి.పి. లో వారిని భాగస్వామ్యం చేసే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలని సి.ఎస్ సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత జిల్లాలలో కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తలపై దృష్టి సారించాలని సి.ఎస్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్సీ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ ఇ.శ్రీధర్, బీసీ సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్టులో ఇరుక్కున్న కుమారుడు.. తట్టుకోలేక గుండెపోటుతో తండ్రి మృతి

భోపాల్, మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్లో దారుణ సంఘటన చోటు చేసుకుంది. కుమారుడు లిఫ్ట్లోఇరుక్కుపోవడంతో తనని కాపాడుకోలేననే భయంతో తండ్రి గుండెపోటుతో మృతి చెందారు. భోపాల్లోని జత్కెడి ప్రాంతంలోని ఓ అపార్ట్మెంట్లో రిషిరాజ్ భట్నాగర్(51) తన భార్య, పిల్లలతో నివసిస్తున్నారు. సోమవారం కుమారుడిని వెతుక్కుంటూ కిందకు వచ్చారు. కుమారుడు కనిపించడంతో అతన్ని ఇంటికి వెళ్లమని సూచించిగా.. ఎనిమిదేళ్ల పిల్లాడు లిఫ్ట్(ం÷బిష) ఎక్కాడు. వెంటనే పవర్కట్ కావడంతో లిఫ్ట్లో ఆ పిల్లాడు ఇరుక్కుపోయాడు. దీంతో రిషిరాజ్ తీవ్ర ఆందోళనకు గురి కావడంతో అయనకు గుండెపోటు వచ్చింది. కొన్ని నిమిషాల్లో పవర్ రావడంతో పిల్లాడు సురక్షితంగా బయటకు వచ్చాడు. అయితే అప్పటికే పడిపోయిన రిషిరాజ్ను అపార్ట్మెంట్ వాసులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రిషిరాజ్ను పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందినట్లు- నిర్ధారించారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

# వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలి !



హైదరాబాద్,వ్యవసాయ రంగంలో కీలక మార్పులు వస్తున్నాయి. రైతులు కూడా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పుల ను గమనిస్తున్నారు. కొత్త తరహా సేద్యానికి అలవాటు పడుతున్నారు. కేవలం వరిపైనే ఆధారపడకుండా కూరగాయలు, పళ్లతోటల పెంపకం,పాడిపశువుల పెంపకంపైనా శ్రద్ధ పెడుతున్నారు. ఈ క్రమంలో రైతులకు మరింత ఆసరా దక్కాలి. బ్యాంకులు కొర్రీలు లేకుండా రుణాలు ఇవ్వాలి. పంటలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు మారాలి. వారికి వ్యవసాయశాఖ పరంగా అన్ని సూచనలు, సలహాలు అందాలి. అన్నింటికిమించి బీమా సౌకర్యం అందించాలి. ఇలా చిన్నిచిన్న సాయాలుచేస్తే రైతాంగం మరింతగా కష్టపడి దేశ పురోభివృద్ధిలో భాగస్వామ్యం కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం దిగుబడులు భారీగా పెరిగాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ముందునుంచి పంటల దిగుబడి పెరుగుతూ వస్తోంది. రైతులు చెమటోడ్చి పంటలు పండిస్తున్నా ఆర్థికంగా మాత్రం ఎదగడం లేదు. పంటలు బాగా పండాయనడానికి ధాన్యం రాశులే దీనికి నిదర్శనం. ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్న దృశ్యాలు చూస్తుంటే ఎంతగా ధాన్యం దిగుబడి అయ్యిందో గమనించాలి. ఓ వైపు జోరుగా కొనుగోళ్లు జరుగుతున్నా మరోవైపు తమ ధాన్యం కొనడం లేదని రైతులు ఆందోళనలకు దిగితున్నారు. ఉచిత విద్యుత్కు తోడుగా, అందుబాటులో నీరు ఉండడంతో జిల్లాల్లో ధాన్యం దిగుబడులు పెరిగాయి. తెలంగాణ కూడా ఇప్పుడు వ్యవసాయికంగా బాగా పురోగమించిందనే చెప్పాలి. మరోవైపు ధాన్యం దిగుబడిలో ఇప్పటికే అగ్రస్థానంలో నిలిచిందని సిఎం రేవంత్ అన్నారు. కాళేశ్వరం నీళ్లు లేకున్నా పంటల దిగుబడి పెరిగిందని మంత్రులు అంటున్నారు. వరిదిగుబడి, ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిం దని భారత ఆహార సంస్థ గతంలో చేసిన ప్రకటన తెలంగాణ వ్యవసాయరంగం పురోగమిస్తోందనడానికి సంకేతం. వ్యవసాయ రంగంలో విప్లవం సాధించిన ఘనత ఎలా ఉన్నా, ధాన్యాగారంగా మారడానికి అన్నదాతల కష్టాలను అభినందించాల్సిందే. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ మాదిరిగా ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. గ్రామాల్లోనే కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనడం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ దశలో వ్యవసాయంలో మరో విప్లవాత్మక మార్పునకు తెలంగాణ సర్కారు దృఢ నిశ్చయంతో ఉన్నది. కృష్ణా, గోదావరి, మూసీ నదీ జలాలు పుష్కలంగా లభిస్తున్న తరుణంలో పంట మార్పిడి దిశగా నియంత్రిత సాగు విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నది. గిరాకీ ఉన్న పంటల్నే పండించడం, డిమాండ్ ఉన్నప్పుడే పంటను మార్కెట్కు తేవడం.. నియంత్రిత వ్యవసాయం లక్ష్యం. వ్యవసాయానికి పెట్టుబడి సాయం మొదలు విత్తనాల్లో సబ్సిడీ, ఎరువుల్లో రాయితీ సమకూర్చుతున్న ప్రభుత్వం... రైతులు మూస విధానం వీడి మంచి ఆదాయం పొందేలా మేధోమధనం జరిపింది. ఈ మేరకు జిల్లా నేలలకు అనువైన పంటలు వేసి లాభాలు గడించేలా ప్రణాళిక రూపొందిం చింది. ఒకే రకమైన పంటలసాగుతో ధరలు తగ్గి రైతులు నష్ట పోతున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న పంటలకు రైతులు కూడా మొగ్గుచూపు తున్నారు. ఇక అవసరమున్న పంటలను పండించాలన్న లక్ష్యంతో వ్యవసాయ రంగం బహుముఖంగా అభివృద్ధి చెందనుంది. కరోనా కాలం కష్ట సమయంలో ధాన్యాగారంగా,యావద్దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది. ఈ విజయం వ్యవసాయరంగ పురోభివృద్ధిలో సాధించిన మైలురాయిగా చూడాలి. అయితే ఉభయ రాష్ట్రాల్లో కరువులు, వలసలతో కొండంత కష్టాలతో కుమిలి పోయిన అన్నదాతల జీవితాలు మాత్రం గట్టెక్కడం లేదు. రైతుభరోసా పెట్టుబడి సాయంతో పాటు 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా అవుతున్నా అనేక కష్టాలను ఈదాల్సి వస్తోంది. అన్నింటికి మించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కక పోవడం, సకాలంలో కొనుగోళ్లు చేయకపోవడం వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదు. యాసంగి దిగుబడిలో మునుపెన్నడూ ఎరుగని రీతిలో వరి దిగుబడి సాధించి రైతులు రికార్డు సృష్టించారు. ఆ తరువాత పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనడంతో అన్నదాతలకు భరోసా దక్కింది. తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన యాసంగి ధాన్యం విలువ పదివేల కోట్ల రూపాయల పై మాటే అని తెలుస్తోంది. యాసంగిలో పండిన వరిధాన్యం సేకరణలో జాతీయస్థాయిలో తెలంగాణది కీలక భాగస్వామ్యమని ఎఫ్సిఐ పేర్కొన్నది. ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందించారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించినట్లు ప్రకటించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి.. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేస్తున్నారని సిఎం రేవంత్ అన్నారు.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి.. కలెక్టర్లు ప్రో యాక్టివ్గా ఉండాలి.. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండని కూడా సూచించారు. ఒక్క నిముషం వృధా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు.. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది.. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టాలి. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.. అప్పుడే కొన్ని సమస్యలయినా తీరుతాయి. రైతులకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం, కూలీల సమస్యను అధిగమించడం కూడా ముఖ్యం.

## వివాహేతర సంబంధంతో ఆత్మహత్య

గద్వాల, వివాహేతర సంబంధం ఆత్మహత్యకు దారితీసింది. ఈ కారణంగా ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న సంఘటన జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలికి చెందిన మహిళ (32)కు భర్త, కుమార్తె ఉన్నారు. ఇదే గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పుల్లన్నతో మహిళకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నెల 12న ఇద్దరూ గ్రామం విడిచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై అప్పట్లో స్థానిక పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదైంది.కుమార్తెను చూడాలనిపించి మహిళ.. ఈనెల 25న గ్రామానికి వచ్చి ఇష్టపూర్వకంగానే అతనితో వెళ్లినట్లు- పోలీసుల ఎదుట చెప్పింది. దీంతో ఇద్దరినీ పోలీసులు ఇళ్లకు పంపించారు. ఈ క్రమంలో రెండు కుటుంబాల మధ్య గొడవలు జరగడంతో 27న పుల్లన్న ఎలుకల మందు తాగడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయం తెలియడం, మరో వైపు భర్త కూడా తీవ్రంగా బాధపడుతుండటంతో మనస్తాపానికి గురైన మహిళ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు- ఎస్ఐ తెలిపారు.

## గోదావరి వృధా జలాలు వాడుకుంటే తప్పేంటి

కడప, వృధాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి జలాలను వాడుకుంటే వచ్చే నష్టమేంటని సిఎం చంద్రబాబు అన్నారు. వృధా జలాలను వినియోగంలోకి తేవాలన్న లక్ష్యం మేరకు బనకచర్ల ప్రతిపాదనలు చేశామని, అయితే దీనిపై బిఆర్ఎస్ పార్టీ రాద్ధాంతం చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా మరోసారి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహానాడులో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో గంజాయిని పూర్తిగా నియంత్రిస్తామన్నారు. శాంతిభద్రతలను ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. తప్పు చేసినవారి పట్ల చండశాసనుడిలా ఉంటానని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమకు ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని ఫైర్ అయ్యారు. రాయలసీమను ఎడారి కానివ్వమని, రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. అలాగే, 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని చంద్రబాబు తెలిపారు.బనకచర్ల వరకు నీరు తేవాలన్నదే తమ లక్ష్యమన్నారు. నదుల అనుసంధానం పూర్తి చేస్తామని, నదీ జలాల వినియోగంలో ఏపీ చివరి రాష్ట్రమని, నదుల అనుసంధానంతో తెలంగాణకూ లాభమేనని చంద్రబాబు వివరించారు. ఈ అంశంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. బనకచర్లతో తెలంగాణకు ఎలాంటి నష్టం జరగదని, సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే తప్పేంటని చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణ తనకు రెండు కళ్లు వంటివి అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇంతవరకు శక్తిమేర పార్టీని సమర్థంగా నడిపానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నా బలం, బలగం.. టీ-డీపీ నాయకులు, కార్యకర్తలేనని పేర్కొన్నారు. ఇంతవరకు జరిగిన అన్ని మహానాడుల కంటే కడప మహానాడు

# విద్యుత్ సంస్కరణలకు చంద్రబాబు రోల్ మోడల్

కడప,వైకాపా ప్రభుత్వ విధానాలు నచ్చక ఎదిరించి పోరాడానని తెదేపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి అన్నారు. ఆ సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుతో పాటు- పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ భుజం తట్టి ప్రోత్సహించారని.. తెదేపా కుటుంబం తనను అక్కున చేర్చుకుందని గుర్తుచేసుకున్నారు. మంత్రి నారా లోకేశ్కు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించి.. కార్యకర్తల ఆకాంక్షలను నెరవేర్చాలని కోటంరెడ్డి కోరారు. వైకాపా దుర్మార్గాలకు ప్రజలంతా భయపడుతున్న రోజుల్లో నిర్బంధాలు, నిషేదాజ్ఞలను లోకేశ్ లెక్కచేయకుండా కార్యకర్తల భుజం తట్టి ప్రోత్సహించారన్నారు.కడపలో నిర్వహిస్తున్న మహానాడులో విద్యుత్ సంస్కరణల తీర్మానంపై కోటంరెడ్డి మాట్లాడారు. విద్యుత్ సంస్కరణలకు చంద్రబాబు రోల్ మోడల్ అని కోటంరెడ్డి కొనియాడారు. ఈ విషయం తాను చెప్పింది కాదని.. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అనేక సందర్భాల్లో చెప్పారని గుర్తు చేశారు. ఈ అంశంలో రాజకీయ ప్రత్యర్థులు సైతం చంద్రబాబును అభినందించక తప్పదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ను 17 మంది ముఖ్యమంత్రులు పాలిస్తే 16 మంది హయాంలో విద్యుత్ ఉత్పాదన 5వేల మెగావాట్లు- మాత్రమే ఉందని చెప్పారు. చంద్రబాబు హయాంలో 16వేల మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని వివరించారు.

# ఆర్టీసీని గట్టెక్కించడం అందరి బాధ్యత



హైదరాబాద్,నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించడం కోసం ఎండి సజ్జన్నార్ రకరకాల ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే కరిమింగిన వెలగపండులా ఆర్టీసీ రోజురోజుకూ కుదేలవుతోంది. ప్రస్తుత నష్టాలను చార్జీల ద్వారా గట్టెక్కించడం అసాధ్యం. దీనికితోడు పెరుగుతున్న డీజిల్ ధరలు కూడా ఆర్టీసికి గుదిబండగా మారాయి. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ మరింత నష్టాల్లోకి దిగజారింది. కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో వెనకాడరాదు. అదేపనిగా టిక్కెట్ ధరలు పెంచినా గట్టెక్కించడం అసాధ్యం. ఆర్టీసిని లాభాల్లోకి తీసుకుని రావడంతో పాటు, కార్మికులకు కాపాడుకునే బాధ్యత యాజమాన్యంపై ఉంది. అయితే ఎండిగా సజ్జన్నార్ బాధ్యతలు తీసుకున్న తరవాత గతంకన్నా మేలనే చెప్పాలి. అనేక విధాలుగా ఆర్టీసీని గట్టెక్కించే చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా చిన్న అవకాశం వదలకుండా కృషి చేస్తున్నారు. ఆర్టీసీని రక్షించుకునే ప్రయత్నంలో కార్మికుల జీవితాలకు కూడా భరోసా కల్పించి ముందుకు సాగాల్సి ఉంది. ప్రజలకు ఉత్తమ, మెరుగైన రవాణా సౌకర్యాలు, బస్సుల్లో అధికరద్దీని తగ్గించడం, అనుకూలమైన, అందుబాటు టికెట్ ధరలు, ఎక్కువ సంఖ్యలో బస్సులు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో సాగుతున్నది. ఆర్టీసీ రక్షణతో పాటు,కార్మికులు పక్షాన కూడా ఆలోచనతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించాల్సి ఉంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధీనంలోని వివిధ రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి. వాటిని పాక్షికంగా లేదా పూర్తిగా ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నిస్తున్నాయి. అనేక సంక్షేమ పథకాల అమలు వల్ల ఎప్పటికప్పుడు నిండుకుంటున్న ఖజానాతోపాటు, ఆర్థిక మాంద్యం దెబ్బతో బడ్జెట్ లెక్కలను నేల మీదకు దించక తప్పలేదు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పనికాదనేది ఆర్థిక రంగ నిపుణుల అభిప్రాయం. మారిన పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టుకు పూర్తిగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్న వారు మినహా మిగిలిన జనం పెద్దగా ఇబ్బంది పడటంలేదు. ఆర్టీసీని కూడా ఏదో రకంగా గట్టెక్కించి లాభాల్లోకిరాకున్నానస్టాలు రాకుండా చూడగలగాలి. ఇది ఏ ఒక్కరిద్దరి సమస్యనో కాదు. 50వేల మంది కార్మికులు, వారి కుటుంబాలతో ముడిపడి ఉన్న అంశం. నిబద్ధతతో పని చేస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తోన్న ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లింపు, 21 శాతం ఫిట్‌మెంట్ తో 2017 పీఆర్సీ, 2013 ఆర్పీఎస్ బాండ్ల డబ్బుల విడుదలతో పాటు– పెండింగ్ డీఏలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. విధి నిర్వహణలో మరణించిన 2,350 మంది సిబ్బంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించామన్నారు. మెడికల్ అన్ ఫిట్ అయిన మరో 537 మందికి ఉద్యోగాలు ఇచ్చామని వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఉద్యోగికి వైద్య పరీక్షలు చేశామని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ ఆరోగ్య టెస్టుల ఫలితంగా 726 మంది ఉద్యోగులకు, 184 మంది ఉద్యోగుల జీవిత భాగస్వామ్యులను ప్రాణాప్రాయం నుంచి సంస్థ కాపాడిందన్నారు. అలాగే, మహాలక్ష్మి పథకం అమలుతో సిబ్బందిలో పెరిగిన పని భారాన్ని తగ్గించేందుకు తాత్కాలికంగా డ్రైవర్, కండక్టర్ పోస్టులకు నియామకాలు చేపడుతుంటే.. కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీలో 3036 రెగ్యూలర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చిందని.. సాంకేతిక కారణాల వల్ల నియామక పక్రియలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆ నియమాకాలు కచ్చితంగా జరుగుతాయి.. అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. తమ మనుగడ కోసం ఐదారు నెలలుగా కొందరు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నా.. ఉద్యోగులు ఎంతో సమయమనంతో ఉన్నారని వీసీ సజ్జనార్ చెప్పారు. అలాగే, ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ కొనుగోలు చేసేలా అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వీసీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వెనుక ఉద్యోగులు, సంస్థ ప్రయోజనాలే ఉంటాయో తప్ప.. ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలు ఉండవన్నారు. ప్రతి నిర్ణయం చాలా పారదర్శకంగా, సంస్థ నియమ నిబంధనలకు లోబడే ఉంటుందని ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

# మోదీ,అమిత్‌షా.. మధ్యలో చౌహాన్!..



న్యూఢిల్లీ, బీజేపీ తదుపరి అధ్యక్షుడిని ఎంపిక చేసుకునేందుకు ఆ పార్టీ తీవ్ర మేధోమథనమే చేస్తున్నది. వచ్చే అధ్యక్షుడు స్వతంత్రంగా వ్యవహరించకుండా, తమకు గట్టి మద్దతుదారుడిగా ఉండాలనేది మోదీ, అమిత్‌షా అభిప్రాయంగా రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఈ క్రమంలో వారి ఆలోచనలకు భిన్నంగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్.. అధ్యక్ష రేసులోకి వచ్చినట్టు వారు అభిప్రాయపడుతున్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర పేరిట శివరాజ్ సింగ్ చౌహాన్ సుదీర్ఘ యాత్రను సెహూర్ నుంచి ప్రారంభించారు. అధ్యక్ష రేసులో తాను ఉన్నాననే విషయాన్ని చాటుకునేందుకు ఈ యాత్ర చేపట్టారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డిజిటల్ హంగామా చేసే బీజేపీ అగ్రనాయకత్వంతో పోల్చితే శివరాజ్‌సింగ్ చౌహాన్ గ్రామీణ ప్రాంత నాయకుడి తరహాలో ఉంటారు. ప్రజలతో కలిసిపోతారు. మధ్యప్రదేశ్‌నే తీసుకుంటే అక్కడి ప్రజలతో భావోద్వేగపూరిత సంబంధాలు ఉన్నాయనే మాట వినిపిస్తూ ఉంటుంది. సరిగ్గా బీజేపీ అగ్రనాయకత్వం జాతీయ వాదం, ఆపరేషన్ సిందూర్‌లో భారత ఆర్మీ సాధించిన ఘనతలు, భారత శక్తిని చాటిన తీరును చాటుకునే ప్రయత్నంలో బిజీగా ఉంటే.. శివరాజ్ సింగ్ చౌహాన్ మాత్రం.. తనదైన శైలిలో ప్రశాంతంగా పాద యాత్రకు దిగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆయన నాలుగు విడతలు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. మోదీకి ముందు అందరి ఆమోదం ఉన్న ప్రధాన మంత్రి అభ్యర్థి అనే అభిప్రాయాలు కూడా అప్పట్లో వ్యక్తమయ్యాయి. కానీ.. మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత ఆయన ప్రాభవం తగ్గించేశారన్న వాదనలూ వచ్చాయి. ఇప్పుడు కేంద్రంలో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి మంత్రిగా ఉన్నారు.మే 25వ తేదీన తన సొంత జిల్లా అయిన సెహూర్ నుంచి ప్రజలతో మమేకమయ్యేందుకు సుదీర్ఘ పాదయాత్రను ప్రారంభించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర అని పేరు పెట్టినా.. దీనికి రాజకీయంగా చాలా ప్రాధాన్యం ఉందని పరిశీలకులు అంటున్నారు. 2029 తర్వాత పగ్గాలు ఎవరికి అనే చర్చ సాగుతున్న తరుణంలో ఢిల్లీలోని బీజేపీ శక్తుల కారిడార్లలో తన పటిమను చాటుకునే ప్రయత్నం ఇందులో కనిపిస్తున్నదని చెబుతున్నారు. ఇది సాదాసీదా వ్యక్తిగత కార్యక్రమం కానే కాదని అంటున్నారు. చౌహాన్ బలమైన జాతీయవాద నాయుకుడిగా చాటు కోవడం లేదని, బీజేపీ అగ్రనాయకత్వం తరచూ పలవరించే డిజిటల్ భాషలు కూడా మాట్లాడటం లేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. వాటికి బదులు ఒకప్పుడు బీజేపీలో కీలక విధానంగా ఉన్న, ఇప్పుడు సోయిలో కూడా లేని ముఖాముఖి చర్చలు, మనుషులకు పలకరింపులు, భావోద్వేగ సంబంధాలు కొనసాగింపు వంటివాటికి ఆయన తిరిగి వస్తున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇప్పుడు దేశంలో ప్రత్యేకించి బీజేపీలో కమాండ్ కంట్రోల్ సమాచార వ్యవస్థ, కరడుగట్టిన జాతీయవాద పోకడలు కనిపిస్తున్న సమయంలో బీజేపీ యొక్క సున్నిత, మృదువైన, సహానుభూతితో సాధారణ ప్రజల్లో తన విశ్వాసాన్ని నిర్మించుకుంటున్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. బీజేపీలో కీలక చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నడ్డా పదవీకాలాన్ని పొడిగించినా.. అది కూడా ముగింపునకు చేరుకున్నది. ఈ దశలో ఉద్దేశపూర్వకంగానే కొత్త అధ్యక్షుడి ఎంపిక విషయంలో మోదీ, అమిత్‌షా నాన్చుడు ధోరణి అనుసరిస్తున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. దానికి ప్రత్యేక కారణం.. రాబోయే అధ్యక్షుడు.. 2029 ఎన్నికల్లో కేంద్ర బిందువుగా మారేందుకు అధికంగా ఉన్న అవకాశాలే. ఈ విషయం బాగా తెలిసిన మోదీ, అమిత్‌షా.. సమాంతర కేంద్రాన్ని ప్రోత్సహించేందుకు సిద్ధంగా లేరన్న చర్చ జరుగుతున్నది. ఆ క్రమంలోనే సాగదీస్తున్నట్టు కనిపిస్తున్నది. ఈ దశలో బీజేపీలో కీలక స్థాయిలో ఒక శూన్యత నెలకొన్నది. ఇప్పుడు శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆ శూన్యాన్ని తాను భర్తీ చేసే ప్రయత్నాల్లో ఉన్నట్టు చెబుతున్నారు. అధిష్ఠానంతో ఎలాంటి ఘర్షణ పూరిత వైఖరిని అనుసరించకుండా.. పత్రికా ప్రకటనలు, టీవీ ఇంటర్వ్యూలతో చెలరేగిపోకుండా.. పావులు కదుపుతున్నారు. శివరాజ్‌సింగ్ పట్ల ఆరెస్సెస్‌లోని గణనీయమైన భాగం సానుకూలతతో ఉన్నట్టు తెలుస్తున్నది. సైద్ధాంతిక, ఆధునిక రాజకీయ, ప్రజామోదం ఉన్న లక్షణాల మేలు కలయికగా అనేక మంది ఆరెస్సెస్ నాయకులు శివరాజ్‌సింగ్‌ను అభివర్ణిస్తున్నారు. ఇది ఆయనకు ఒక ప్లస్ పాయింట్ అవుతుందనే చర్చలు వినిపిస్తున్నాయి. నిజానికి పార్టీ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియను బీజేపీ కొనసాగిస్తున్నది. అయితే.. మధ్యలో పహల్గామ్ దాడి, అనంతరం ఆపరేషన్ సిందూర్ వంటి పరిణామాలు.. ఆ ప్రక్రియకు తాత్కాలిక బ్రేకులు వేశాయి. 29 రాష్ట్రాలకు గాను ఇప్పటికే 15 రాష్ట్రాలకు అధ్యక్షులను ఎంపిక చేసింది. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి అవసరమైన కోరంలో 12 మంది రాష్ట్ర అధ్యక్షులు ఉంటే సరిపోతుంది. కొత్తగా పార్టీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేసుకుంటున్న వారితో పోల్చితే చౌహాన్‌కు అనేక ప్రత్యేకతలు ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. సంఘ్ సంస్థాగత సంస్కృతి మూలాలు చౌహాన్‌లో ఉన్నాయి. ఏబీవీపీ నేత స్థాయి నుంచి ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎదిగిన నాయకుడు చౌహాన్. సీనియర్ ప్రచారక్‌లతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మోదీ, షా అనంతర కాలంలో పార్టీని సంస్థాగతంగానే కాకుండా సామాజిక కోణంలోనూ ముందుకు

# కమల్ హాసన్ కు రాజ్యసభ పదవి.. డీఎంకేకు ఒరిగేదేంటి?




చెన్నై:అన్ని అంశాల్లో కాకున్నా.. కొన్ని అంశాలు రాజకీయాల్లో చాలా క్లియర్ గా క్లారిటీతో ఉంటాయి. అధినేత స్థాయిలో జరిగే ఒప్పందాలు.. ఇచ్చే హామీలు అమలు పక్కాగా ఉంటుంది. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం విశ్వ కథానాయకుడు కం ఎంఎన్ఎం పార్టీ అధినేత కమల్ హాసన్ ను రాజ్యసభకు పంపేందుకు వీలుగా తమిళనాడు అధికార పక్షం డీఎంకే నిర్ణయం తీసుకోవటం తెలిసిందే. తమిళనాడుకు చెందిన అన్బుమణి రామదాస్.. ఎం.షణ్ముగమ్.. ఎన్. చంద్రశేగరన్.. ఎం. మహమ్మద్ అబ్దుల్లా.. పి. విల్సన్.. వైగోల రాజ్యసభ పదవీ కాలం జులై 25తో ముగియనుంది.వీరి స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తాం న్నది ఆసక్తికరంగా ఉంది. ఆ మధ్య జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలకు ఉన్న ఎమ్మెల్యేల బలాన్నిచూస్తే డీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో.. ఈ పార్టీ తరఫున నలుగురు రాజ్యసభ సభ్యత్వాన్ని పొందే వీలుంది. అదే సమయంలో అన్నా డీఎంకేకు ఒక సభ్యుడ్ని రాజ్యసభకు పంపే వీలుంది. ఒకవేళ మిగిలిన మరో స్థానాన్ని సొంతం చేసుకొని తమ సభ్యుడ్ని రాజ్యసభకు ఎంపిక అయ్యేలా చేయలంటూ బీజేపీ.. పీఎంకే ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాల్సి ఉంటుంది.ప్రస్తుతం అన్నాడీఎంకే బీజేపీ మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది (2026) ఏప్రిల్ – మేలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తాజా రాజ్యసభకు పంపే వారి నియామకం మొత్తం కూడా సదరు ఎన్నికలను సైతం పరిగణలోకి తీసుకొని ఎంపిక చేయటం ఖాయం. కమల్ హాసన్ ఎంపిక కూడా ఆ కోవకు చెందిందే. గత ఏడాది లోక్ సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే.. కాంగ్రెస్ కూటమికి కమల్ హాసన్ పార్టీ మద్దతు పలకటం.. ఒప్పందం లో భాగంగా తమిళనాడులోని 39 ఎంపీ స్థానాలతో పాటు.. పుదుచ్చేరిలోని ఒక స్థానం తరఫున పోటీ చేసే మిత్రపక్షం అభ్యర్థుల తరఫున ప్రచారం చేయటం తెలిసిందే.ఇందుకు బదులుగా రాజ్యసభ సభ్యత్వాన్ని కమల్ హాసన్ కు కట్టబెట్టేందుకు వీలుగా డీఎంకే అధినేత.. తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రాజ్యసభకు కమల్ హాసన్ వెళ్లటం లాంఛనంగా మాత్రమే మారిందని చెప్పాలి.ఇదే సమయంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడు రాజకీయాల్లో ఏర్పడే రాజకీయ సమీకరణాలు స్పష్టమయ్యాయని చెప్పాలి.రాజ్యసభకు కమల్ హాసన్ ఎంపిక నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే.. కాంగ్రెస్ తో పాటు కమల్ హాసన్ పార్టీలు కలిసి కూటమిగా మారనున్న విషయం క్లియర్ అయ్యిందని చెప్పాలి.అదే సమయంలో విపక్ష అన్నాడీఎంకే.. బీజేపీతో పాటు సినీ నటుడు విజయ్ ఏర్పాటు చేసిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) కలిసి కూటమిగా ఏర్పడే అవకాశాల్ని మరింత పెంచిందన్న మాట వినిపిస్తోంది. కమల్ హాసన్ ఎంపికతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరెవరు జత కలుస్తారన్న దానిపై స్పష్టత వచ్చినట్లేనని చెబుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో స్టాలిన్ పాలనపై తమిళ ప్రజలు పెద్ద సంతోషంగా లేరన్న మాట వినిపిస్తోంది. రాబోయే ఏడాది వ్యవధిలో ఈ వాదన బలహీనం కాని పక్షంలో డీఎంకే కూటమికి మైనస్ అవుతుందని చెబుతున్నారు. కమల్ హాసన్ ఎంపికతో అన్నాడీఎంకే.. బీజేపీ బంధం బలపడటమే కాదు.. టీవీకే కూడా వారితో చేతులు కలిపిన పక్షంలో అనూహ్య పరిణామాలు ఏర్పడటం ఖాయమన్న మాట వినిపిస్తోంది.

# అస్తవ్యవస్తంగా ముంబై డ్రైనేజీ వ్యవస్థ



ముంబై,ముంబై మహానగరంలో ఏటా వర్షాలు వస్తే నరకం చూడాల్సిందే. చిన్నపాటి వర్షం అయినా చిగురుటాకులా వణికిపోతుంది. అలాంటిది సాధారణం కన్నా రెండు వారాల ముందుగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు 107 ఏళ్ల నాటి రికార్డులను చెరిపివేస్తూ కురిపించిన కుండపోతతో దేశ ఆర్థిక రాజధాని అతలాకుతలమైంది. ఎంతటి మహానగరమైనా వరుణుడు కన్నెర్ర చేస్తే నడిసంద్రంలా మారుతున్న తీరు మన పాలకుల ముందుచూపు లేమికి నిదర్శనంగా నిలిచిపోతోంది. గతంలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ... ఇలా ఎన్నో ఉదాహరణలు ఉండనే ఉన్నాయి. 2021లో ఇదే ముంబై నగరం భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయింది. ఆకస్మికంగా భారీ వర్షాలు కురిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై నిపుణుల కమిటీలు పలు సిఫార్సులు చేశాయి. కానీ, పాలకులు వాటిని అమలు చేయకుండా బుట్టదాఖలు చేయడం వల్లనే ఇటువంటి నష్టాలు తిరిగి సంభవిస్తున్న పరిస్థితి. ప్రధానంగా ఆక్రమణలు, డ్రైనేజీ వ్యవస్థ అల్లకల్లోలం చేస్తున్నాయి. ఆర్థిక నగరానికి ఆదాయం ఉన్నా దానిని బాగు చేసే ఆలోచనలో పాలకులు లేరు. ఎవరు అధికారంలో ఉన్న ముంబై అతలాకుతలం కావాల్సిందే. మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ చూపకపోవడం నగరాలు, పట్టణాలు నీట మునకకు కారణమవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీలు తదితర మౌలిక వసతులు కల్పించి, నీటి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకునేందుకు ఇప్పటి–కై–నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భుజంభుజం కలపాలి. ప్రకృతికి అనుకూలంగా ఉండే ప్రాజెక్టులను రూపొందించడం, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం, నూతన నగరాల నిర్మాణంలో, ఉన్న నగరాల విస్తరణలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లాంటి చర్యలు అత్యావశ్యకం. ఈ ఏడాది 16 రోజులు ముందుగానే రావడం గత 75 ఏళ్లలో ఇదే తొలిసారి. మునిగిన రహదారులు, భూగర్భ మెట్రో లైన్లు, రైల్వే స్టేషన్లతో నగర జీవనం స్తంభించిపోయింది. రోడ్డు, రైలు, విమాన సర్వీసులకూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎల్లో అలర్ట్‌ను జారీచేయడం ద్వారా ఈ స్థాయి వర్షాలను అంచనా వేయడంలో భారత వాతావరణ శాఖ విఫలమైనట్టే! గతంలో వయనాడ్‌లో భారీ వర్షాలతో కొండచరియల బీభత్స సమయంలోనూ వాతావరణ శాఖ వైఫల్యం మనమెరిగిందే! ఇంతటి భారీ వర్షపాతానికి సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల, వాతావరణ మార్పులు ప్రధాన కారణమని ఐఎండి చెబుతోంది. ధారాపాతంగా రాత్రంతా కురిసిన 200 మిల్లీమీటర్లకు మించిన వర్షపాతం ముంబైని ముంచెత్తింది. పొరుగున ఉన్న కొలాబాలో సోమవారం 295 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం 1918 నాటి రికార్డు 279.4 మిల్లీమీటర్లను తిరగరాసింది. దక్షిణ ముంబైలో 13 గంటల్లోనే 252 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లోనూ వర్షాలు ప్రభావం చూపాయి. కేరళలో రుతుపవనాలు ప్రవేశించిన పది రోజులకు మహారాష్ట్రకు రావాల్సి ఉండగా 24 గంటల్లోనే ఇక్కడ ప్రతాపం చూపాయి. సాధారణంగా ఏటా జూన్ 11న ముంబైలో రుతుపవనాలు ప్రవేశిస్తాయి. వాతావరణ శాఖ మరింత అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా నష్టాల తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం అమలుకు అమెరికాలాంటి అగ్రరాజ్యాలు చేతులెత్తేయడం, పర్యావరణ పరిరక్షణకు చేసిన తీర్మానాల అమలుకు శ్రద్ధ చూపని ధనిక దేశాల తీరు ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను భారీగా పెంచేస్తున్నాయి. మూడో ప్రపంచ దేశాలకు పెనుముప్పుగా మారిపోతున్నాయి.ఏటా అంతక్రితం ఏడాదితో పోలిస్తే భారీ వర్షాలు నమోదవుతూనే ఉన్నాయని కేంద్రప్రభుత్వ ఎర్త్ సైన్స్ విభాగం ఐదేళ్ల క్రితమే అంచనా వేసింది. కుండపోత వర్షాలు కురిసినా చెరువులు, వాగులు, వంకలు లాంటి సహజ సిద్ధమైన ప్రవాహ మార్గం ద్వారా గతంలో వెళ్లిపోయేవి. నగరాలు, పట్టణాల విస్తరణ, అక్రమార్కుల కబ్జాలు, వాటికి పాలకుల ప్రోత్సాహం... ఇవన్నీ నీటి ప్రవాహానికి ఎక్కడికక్కడ అడ్డంకులుగా వున్నాయి. గత ఏడాది విజయవాడను ముంచెత్తిన వరదలు కూడా ఇలాంటివే. ప్రకృతి వైపరీత్యాల నష్టాల తీవ్రతకు పాలకుల విధాన వైఫల్యమే ప్రధాన కారణం.

# బీఆర్‌ఎస్' మా పై దుష్ప్రచారం చేస్తోంది: చంద్రబాబు



అమరావతి,టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు.. తాజాగా తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పై సీరియస్ కామెంట్లు చేశారు. బీఆర్ఎస్ నాయకులు తమ పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన మహానాడు వేదిక పై మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా బనకచర్లలో నిర్మించే భారీప్రాజెక్టు అంశాన్ని ప్రస్తావించారు. గోదావరి జలాలను పోలవరం ద్వారా.. మళ్లించి.. బనకచర్లలో నిల్వ చేసి.. కర్నూలు సహా రాయలసీమ ప్రాంత ప్రజలకు అందించాలన్నది తమ సంకల్పంగా చెప్పుకొచ్చారు.దీనికి సంబంధించిన డీపీఆర్ కూడా రెడీ అయిందన్న చంద్రబాబు.. కేంద్రంతోనూ పలుమార్లు చర్చించామని.. దీనికి త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు. కానీ, దీనిపై బీఆర్ఎస్ నాయకులు విష ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. "గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుంటే.. వాటిని వాడుకునేందుకు మేం ప్రాజెక్టు కట్టుకుంటున్నాం. దీనిని కూడా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ కు నేను ఒక్కటే చెబుతున్నా.. సముద్రంలో పోయే నీటిని వాడుకుంటే తప్పా? ప్రజలకు మేలు చేస్తే ఓర్చుకోలేరా?" అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలను ఆపాలని సూచించారు. బనకచర్లతో తెలంగాణకు ఎలాంటి నష్టం జరగదని, సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే తప్పేంటి? అని చంద్రబాబు ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా రాయల సీమను సస్యశ్యామలం చేయనున్నట్టు చంద్రబాబు వెల్లడించారు. దీనికి కేంద్రం కూడా అనుమతి ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇక, ఏ ప్రాజెక్టు కట్టినా.. దాని ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలనేదే తమ ఉద్దేశమని చంద్రబాబు పేర్కొన్నారు. తనకు స్వార్థం లేదన్నారు. తెలుగు ప్రజల కోసమే పని చేస్తున్నానని వ్యాఖ్యానించారు.

ఏం జరిగింది?

కర్నూలు జిల్లా బనకచర్లలో భారీ ప్రాజెక్టు కట్టాలనేది చంద్రబాబు ప్రభుత్వనిర్ణయం దీనికి 80 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుంద ని అంచనా వేశారు. అయితే.. దీనివల్ల తమకు ముప్పు వస్తుందని తెలంగాణలోనికాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి ఇప్పటికే రిప్రజం టేషన్ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాశారు. అంతేకాదు.. దీనిని అడ్డుకుంటామని మంత్రులు కూడా ప్రకటించారు. ఇక, బీఆర్ఎస్ నేత కేటీఆర్ కూడా.. ఏపీ బనకచర్ల కట్టేందుకు సిద్ధమైతే.. రేవంత్ రెడ్డి కళ్లు మూసుకున్నారని గతంలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ప్రస్తావించిన చంద్రబాబు బీఆర్ ఎస్‌పై విమర్శలు గుప్పించారు.

## 12 లక్షలు లంచం డిమాండ్

రంగారెడ్డి,లంచం తీసుకుంటున్న అధికారులు ఎంత మందిని అరెస్ట్ చేసినా.. అవినీతి చేసే వాళ్లలో మాత్రం ఏమాత్రం మార్పు రావడం లేదు. చిన్న పని పెద్ద పని అనే తేడా లేకుండా లంచం డిమాండ్ చేసే అధికారులు రోజురోజుకీ పెరిగిపోతున్నారు. తాజాగా అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో లంచగొండి అధికారి చిక్కాడు.

# డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ ఇచ్చిన అమెరికా కోర్టు..

వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొచ్చిన 'లిబరేషన్ డే' టారిఫ్ లకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ విధించిన దిగుమతి సుంకాలను అమెరికాలోని కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ బుధవారం అడ్డుకున్నట్లు ప్రకటించింది. మ్యాన్ హాటన్ లోని కోర్టులో ముగ్గురు న్యాయమూర్తుల బృందం ఇచ్చిన తీర్పులో.. అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించే అధికారం కేవలం కాంగ్రెస్‌కే ఉందని, అధ్యక్షుడికి అత్యవసర అధికారాలు ఉన్నా అవి ఆ అధికారం మీద ప్రభావం చూపవని స్పష్టం చేసింది కోర్టు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ట్రంప్ ప్రభుత్వం "లిబరేషన్ డే" పేరుతో అన్ని దిగుమతులపై కనిష్ఠంగా 10% సుంకాన్ని విధిస్తూ, ఎక్కువ ట్రేడ్ సర్ప్ ప్లస్ కలిగిన దేశాలపై మరింత అధిక సుంకాలు విధించనున్నట్లు ప్రకటించింది. ఈ చర్య ద్వారా స్థానిక పరిశ్రమల ఉత్పాదకతను పెంచాలని, ట్రేడ్ డెఫిసిట్‌ను తగ్గించాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ట్రంప్ ఈ చర్యను International Emergency Economic Powers Act (IEEPA) కింద తీసుకున్నానని పేర్కొన్నారు. కాకపోతే, కోర్టు ఈ చట్టాన్ని ఆర్థిక ఒత్తిడి సాధనంగా వినియోగించేందుకు వీలు లేదని తేల్చింది.




ఈ టారిఫ్‌లపై అమెరికాలోని ఐదు చిన్న దిగుమతి వ్యాపార సంస్థలు, ఒరెగాన్ రాష్ట్ర అటార్నీ జనరల్ డాన్ రేఫీల్డ్ నాయకత్వంలో ఉన్న 13 రాష్ట్రాల కూటమి వ్యాజ్యం దాఖలు చేశాయి. ఈ టారిఫ్‌లు చట్టవిరుద్ధం, నిర్లక్ష్యంగా తీసుకున్నవని, ఆర్థికంగా నష్టం కలిగించేవి అంటూ వారు పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com